# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి వారి

**శ్రీ శుభకృతు ఉగాది (2022) సంచిక**



**పద్మశ్రీ పురస్కార గ్రహీత**

**బ్రహ్మశ్రీ మహా సహస్రావధాని**

**డా॥ గరికపాటి నర్సింహారావు గారికి**

**అభినందనలతో**

Telugu Jyothi

A Literary Magazine from
Telugu Fine Arts Society






Contact me about a career that can better your financial future while helping others with theirs.


**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837


To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

మావిచిగురు మల్లెలవిరులు
కోయిల పాట క్రొత్త ఋతువు
కళలొలుకగ ప్రకృతి కాంత నిండుగ
వసంతాగమన శోభ కన్నుల పండుగ

ఆత్మీయులందరికీ

## శుభకృతు నామ ఉగాది

## శుభాకాంక్షలు

*From*

**TFAS Executive Committee**

• Sreedevi Jagarlamudi • Bindu Yalamanchili • Jyothi Gandi • Anuradha Para
• Anuradha Dasari • Srinivas Cheruvu • Ravi Annadanam

# తెలుగు కళా సమితి
## Telugu Fine Arts Society

HAPPY
Mother's Day



**అమ్మతనంలో కమ్మదనం**
**ఆశీర్వదించే అమృతహస్తం**
**స్ఫూర్తి నింపే మహోన్నతత్వం**
**అమ్మ ప్రేమకు పాదాభివందనం**

## మాతృదినోత్సవ శుభాకాంక్షలు

*From*

**TFAS Executive Committee**

• Sreedevi Jagarlamudi • Bindu Yalamanchili • Jyothi Gandi • Anuradha Para
• Anuradha Dasari • Srinivas Cheruvu • Ravi Annadanam

# Telugu Fine Arts Society

## Board of Trustees : 2020 - 2022



Sreedevi Jagarlamudi
President



Bindu Yalamanchili
Secretary



Jyothi Gandi
Treasurer



Anu Para
Cultural Chair



Anuradha Dasari
IT Chair



Srinivas Cheruvu
Vice President / Membership Services



Ravi Annadanam
Community Chair

## Advisory Board



Dr Hari Eppanapally
Member



Ram Kolluri
Member



Radha Kasinadhuni
Member



Dr Satyaveni Rao
Member



Seshu Tatikatla
Member

## Telugu Jyothi



Utukuri Vignan Kumar
Editor

# Telugu Fine Arts Society
# తెలుగు కళా సమితి

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
http://www.tfas.net P.O Box 278 Edison NJ 08818-0278



**Board of Trustees 2020-2022**

**President**
**Sreedevi Jagarlamudi**
*president@tfas.net*

**Vice President/ Membership Services**
**Srinivas Cheruvu**
*membership@tfas.net*

**Secretary**
**Bindu Yalamanchili**
*secretary@tfas.net*

**Treasurer**
**Jyothi Gandi**
*treasurer@tfas.net*

**Cultural Services**
**Anuradha Para**
*events@tfas.net*

**IT Services**
**Anuradha Dasari**
*it@tfas.net*

**Community Services**
**Ravi Annadanam**
*community@tfas.net*

**Advisors**
Dr. Hari Eppanapally
Ram Kolluri
Radha Kasinadhuni
Dr. Satyaveni Rao
Seshu Tatikatla

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor


## అధ్యక్షురాలి కలం నుండి

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు...
ముందుగా తెలుగు కళా సమితి సభ్యులకు ఆత్మీయులకు మరియు శ్రేయోభిలాషులకు
**శుభకృతు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు.**



Covid మహమ్మారి కేసులతో సతమతమవుతూ ఉండగానే మార్చి నెల వచ్చేసింది. మార్చి నెలలో తెలుగు కళా సమితి కి గౌరవప్రదమైన Trimurthy day (సంగీత త్రిమూర్తుల) సంబరాలను చాలా ఘనంగా Virtual లో జరుపుకున్నాము. అంతేకాక మొట్టమొదటిసారిగా తెలుగు కళా సమితి సభ్యులకు మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాము. ఈ కార్యక్రమంలో చాలా మంది మహిళా సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా మాతృమూర్తులకు మరొకసారి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

ఇకపోతే మన తెలుగు నూతన సంవత్సర ఉగాది సంబరాలను Tagore Hall, Somerset లో నిర్వహించాము. ఈ కార్యక్రమానికి స్థానిక కళాకారులతో పాటు Play back singers ML Gayatri మరియు Venu విచ్చేసి శ్రోతలను మెప్పించారు. వీరితో పాటు కామెడీ మరియు మిమిక్రీ ఆర్టిస్ట్ Avinash వచ్చి అందరినీ చాలా బాగా అలరించారు. అలాగే మొదటిసారి తెలుగు Rapper Roll Rida వచ్చి చిన్నారులను పెద్దలను బాగా ఆడించారు మరియు పాడించారు. ఈ వేడుకలకు చాలామంది విచ్చేసి కార్యక్రమాన్ని దిగ్వి జయం చేశారు. ఉగాది కార్యక్రమానికి సపోర్ట్ చేసిన Sponsors మరియు donors కి, అలాగే వాలంటీర్స్ కి మరొకసారి హృదయపూర్వక ధన్యవాదములు.

చూస్తూ చూస్తూనే మా యొక్క రెండు సంవత్సరముల term(June 2020 to May 2022) పూర్తి అయిపోతుంది. అంతేకాక నా ఆరు సంవత్సరముల executive committee బాధ్యతలు పూర్తి అవుతుంది. ఇప్పటివరకు నేను Events Chair, Secretary and President గా బాధ్యతలు నిర్వహించాను. ప్రతి బాధ్యత లో ఎన్నో అనుభవాలను మరి ఎన్నో తీపి గుర్తు లను సమకూర్చుకున్నాను.

అలాగే మొట్టమొదటిసారి TFAS చరిత్రలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ అమలు పరచి నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించాము. బహుశా మీరు ఈ శీర్షిక చదివేసరికి ఎన్నికల ఫలితాలు వచ్చేసి ఉంటాయి. కొత్త కార్యవర్గాన్ని ఎన్నిక చేసి ఉంటాము. కొత్త కార్యవర్గానికి స్వాగతం పలుకుతూ నాతో పాటు పనిచేసిన కార్యవర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

సర్వేజనః సుఖినోభవంతు!!
మీ సేవలో
జాగర్లమూడి శ్రీదేవి

# విషయ సూచిక


| | |
|---|---|
| అధ్యక్షురాలి కలం నుండి | 6 |
| సంపాదకీయం | 9 |
| A Message from Out-going President | 11 |
| మా ఆయన వజ్రం - తిరుమల శ్రీ | 12 |
| రాదారి పాదాలు - సనాతని వెంకు | 14 |
| మనవడు - జీ వీ రమణ | 15 |
| ప్రజాస్వామ్య ప్రాణవాయువు - భైతి దుర్గం | 17 |
| అశ్రు కణం - పీ వీ శేషారత్నం | 18 |
| మట్టి పాదాలు - చొక్కర తాతారావ్ | 22 |
| బామ్మ గారూ సెల్ ఫోనూ - భాగవతుల భారతి | 23 |
| 2022 ఉగాది సంబరాలు | 25 |
| మంచం - దొండపాటి నాగ జ్యోతి శేఖర్ | 30 |
| చెరి సగం - గొర్తి వాణి శ్రీనివాస్ | 31 |
| సంగీత త్రిమూర్తి దినోత్సవం | 33 |
| ఇదేమి న్యాయం - పిడపర్తి భారతి | 41 |
| Women's Day 2022 | 44 |


**Opinions expressed in this volume are those of the authors and not of TFAS.**

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society



సహనం
సౌజన్యం
సామర్థ్యం
మూర్తీభవించిన
శక్తిస్వరూపం
స్త్రీమూర్తికి వందనం
అభినందనం

## Happy Women's Day

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

From

**TFAS Executive Committee**

• Sreedevi Jagarlamudi • Bindu Yalamanchili • Jyothi Gandi • Anuradha Para
• Anuradha Dasari • Srinivas Cheruvu • Ravi Annadanam

# సంపాదకీయం

ఈ వేళ గురువారం Scripps National Spelling Bee Finals. ఈ దశకి చేరిన 13 మంది పిల్లల్లో 11 మంది Indian Origin పిల్లలు. వాళ్ళలో ముగ్గురు నలుగురు తెలుగువాళ్ళు. చివఱకు గెలిచింది హరిణి లోగన్ అన్న 'మనమ్మాయి '. వీళ్ళని చూస్తుంటే నా మదిలో మళ్ళీ మెదిలింది, 30 ఏళ్ళ క్రితం USA వచ్చినప్పుడు అందఱూ నన్నడిగిన ప్రశ్న, 'ఏమయ్యా మీఱంతా ఇంత తెలివిగలవాళ్ళు కదా, మీ దేశం అంత బడుగు దేశంగా ఎందుకున్నదీ' అని (అప్పటికింకా Y2K ప్రభంజనం మొదలవ్వలేదు). అది అప్పుడే కాదు ఇప్పుడు కూడా వచ్చే ప్రశ్నే, కాకపోతే ఇప్పుడు మఱో రకంగా వేయచ్చు: మన దేశం అన్ని వేల సంవత్సరాలుగా బడుగు దేశంగా ఎందుకుండిపోయిందీ' అని.

మన పూర్వీకులు దాదాపు 2,500 సంవత్సరాల క్రితమే 'అథాతో బ్రహ్మ జిజ్ఞాసా' అని యోచన చేశారు, 'పూర్ణమదహ్ పూర్ణమిదం' అని అంతు లేదనిపించే బ్రహ్మాండాన్ని గుఱించి సిద్ధాంతాలు వల్లించారు, నాలుగు వేదాలు, శతాధికంగా ఉపనిషత్తులు, అసంఖ్యాకంగా భాష్యాలూ రచించారు. అదంతా కూడా 500BCE పూర్వపు కథలుగా మిగిలిపోయాయి. ఆలోచిస్తే 500BCE నుండి 2,000 CE దాకా వైజ్ఞానికంగా మనమొక చీకటి ఖండంగా ఉండి పోయమా అనిపిస్తుంది. ఆ చీకటిలో వెలిగింది భాస్కరుడు, వరాహమిహిరుడు, కణాదుడు లాంటి చాలా కొద్ది తారలే.

ఈ చీకటి రాజ్యాలు చాలా చోట్లే వచ్చాయి, ఉదాహరణకి ఐరోపా అంతా కుడా 500CE నుండి 1500CE దాకా చీకటి రాజ్యమే కదా అంటే, దానికి కారణం మతోన్మాదం. కానీ మనకి అంత చీకటి వచ్చిందీ అంటే 'పరాయి పరిపాలన ' అని మనమొక standard excuse చెప్పుకుంటాం. కానీ ఆలోచిస్తే, దాదాపు 400 BCE నుండి 900CE దాకా సింధు నది దాటి ఏ పరాయి రాజులు  రాలేదు, ఏ పరాయి దండయాత్రలు జఱగలేదు. ఆ తరువాతే ఘోరీ, ఘజనీ, ముఘల్ పరిపాలన వగైరా. వారందఱి తరువాత బ్రిటిష్ వారి పరిపాలన. ఆ మాటకొస్తే పరాయి పరిపాలన, యుద్ధాలు లేనిదెక్కడ? రెండవప్రపంచ సంగ్రామం దాకా కూడా ఐరోపా అంతా యుద్ధాలే కదా!

ఈ చర్చ సమాధానాలు దొఱకని చర్చ, అంతం కాని చర్చ. ఒక విధంగా నిరర్ధకమైన చర్చేమో కుడా. 1948 నుండీ దాదాపు అనాఘాతంగా అభివృద్ధి చెందుతూనే ఉన్నాం, 2,000 నుండీ ఇంకా ఉధృతంగా ముందుకు సాగుతున్నాం. ప్రజాస్వామ్యానికి దేశ సమైక్యతకి భంగం కాకుండా కాపాడుకో గలుగుతున్నాం. చర్చలు కట్టిపెట్టి అంతటితో తృప్తి పడ్డాం, 'తమసోమా జ్యోతిర్గమయ ' అని ముందుకి సాగుదాం.

ఇక కొన్ని 'మన ' విషయాలు. ప్రజా స్వామ్యానికి పట్టుగొమ్మలు ఓటరులూ ఎన్నికలూ. మనది కేవలం స్వచ్ఛంద సేవకులతో పని చేసే కళా సమితి ఐనా కూడా రాజకీయాలూ ఎన్నికల దురాచారాలూ తప్పించుకోలేకపోయాం కొన్నేళ్ళ నుండీ. ఈ దురాచారాలు తొలగించాలని ఎన్నో కలలు కన్నాం కానీ కారణాంతరాల వలన అది కుదర లేదు. కానీ ఈ ఏడాది జఱిగిన ఎన్నికలలో electronic voting తో చాలా మటుకు మనం ఎన్నికలు సాఫీగా జఱుపుకోగలిగాం. దేశం లోని మిగతా తెలుగు సంఘాల నుంచి మన విజయానికి చాలా అభినందనలు కూడా వస్తున్నాయి. ఇన్నాళ్ళ నుండీ కుదఱని పని విజయవంతంగా నెరవేర్చినందుకు ఎన్నికల సంఘానికీ, కార్యవర్గానికీ, Advisory Board వారికీ అభినందనలు.


అధ్యక్షులుగా ఎన్నికైన రాచకుళ్ళ మధుసూధన్ గారికీ వారి బృందానికి అభినందనలు.

## సంపాదక వర్గం

ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (సంపాదకులు),  ఉప్పల అనంత సుధాకర్, తాడేపల్లి కుమార్,
తిప్పాభొట్ల రవిశంకర్, మధు రాచకుళ్ళ, తాతా వేంకట సత్య ప్రభాకర మూర్తి

## తెలుగు కళా సమితి ప్రతినిధులు

పారా అనురాధ



**సభ్యులందరికీ ఉగాది శుభాకాంక్షలు.**

**మహారాజ పోషకులు శ్రీమతి కొల్లూరి గిరిజ, శ్రీ కొల్లూరి రామ్ గార్లు**

icon
TECHNICAL GROUP

# A Message from Out-going President

Dear TFAS members, supporters, and well-wishers,

As an outgoing president I would like to take this opportunity to thank each and everyone of you who supported me and my team during our two-year tenure (June 2020 to May 2022).

Special thanks to my team members Srinivas Cheruvu – VP/Membership chair, Bindu Yalamanchili - Secretary, Jyothi Gandi – Treasurer, Anuradha Para – Cultural Chair, Anuradha Dasari – IT Chair, Ravi Annadanam-Community Chair who were part of this journey with me.

As you all remember, we were sworn in June 2020 at the height of the pandemic, when all of our lives changed with a sudden jolt. During that critical time in our lives, our priority and goals were to learn about the virus, stay healthy, and strive for our own survival. As an association renowned for in-person cultural, literary and community events, our team was presented with new challenges during the pandemic. As the saying goes, "survival is the mother of invention". My team put on their creative hats to continue our mission in this new world.



Thanks to technology, we seamlessly jumped into the virtual world. As a side benefit, we were pleasantly surprised to say that we not only reached our local Telugu community but we extended to a national and international audience and were able to collaborate with other

Telugu organizations across the country. Some of the programs conducted virtually that were well received during our tenure:

- College Counseling with Student Mentors
- Immigration Seminar on F&H Visas
- Family Summer Fun
- Meditation for mental Health & Staying Healthy with Isha Foundation
- Sri Krishna Thulabharam drama by Surabhi, keeping arts alive
- Financial Webinar
- Sankranthi Sambaralu
- Trimurthy Day Celebrations for 2021 & 2022 - our TFAS signature event
- Women & Financial Security along with TLCA(NY), WATS(Seattle Washington) and HTCA(Houston) organizations.
- Yoga for Mental Health by The Art of Living
- First time conducted 27 SAT Prep Sessions by Peer Tutor
- Health Webinar on Heart & Diabetes
- Tax Webinar

With the increase of vaccinations and better knowledge of the virus, we managed to conduct in-person events. Your feedback was that you no longer wanted to stay isolated, and were willing to engage in social activities. With your overwhelming support, the following in-person events were well attended.

- Sports Competitions (Tennis, Badminton (first time with women teams' participation), Cricket & Volleyball)
- Fall Family Fun (F3)
- Deepavali Celebrations 2021
- First Time conducted Women's Day celebrations – Exclusively for TFAS members
- Ugadi 2022

As we were conducting our cultural and community programs, we fulfilled some of the organization's long term housekeeping goals by getting a permanent PO Box, credit card, cleanup of the mailing addresses and email addresses in the membership database. In addition, as one of the first organizations, we are proud to say that voting by email for the biennial elections was initiated during our term. Goals for our term evolved with the times. So, the common themes for our programs have been health awareness, wealth, educational seminars for our youth, and Telugu culture. Thanks to you all, TFAS members, the message spread and we were able to add over 125+ new members to our organization. Even during the crisis and economic uncertainty, generosity from our TFAS members and supporters continued to flow. As a result of these donations, TFAS was recognized as the helping hand in the local community as well as in India.

- Oxygen Cylinders Distribution with PURE Collaboration
- Covid preventive kits for Kids in Bommarillu Orphanage
- Food/Grocery distribution to Covid patients
- Ozanam Homeless Shelter Food/Supplies Distribution
- Winter Coat Drive with Gandhian Society
- Multiple Free Covid Vaccination Drives for kids and adults on our own and in partnership with national organizations

As a team who served during the pandemic, I hope we brought unique, useful, and practical programs to our TFAS community while keeping the TFAS goals and objectives. It was definitely a historical tenure. Our hearts go out to those who have suffered and extend our condolences to those who lost their loved ones.

As we move ahead into "Subhakruth Nama Samvatsaram", I would like to thank everyone once again and convey my best wishes to the newly elected Board of Trustees for the 2022-2024 term.

Stay safe and healthy!!

**Sreedevi Jagarlamudi,**
TFAS President (2020-2022)

# మా ఆయన వజ్రం
## తిరుమలశ్రీ

సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన అర్పిత వాష్ చేసుకుని వచ్చేసరికి, కాఫీ కప్పుతో కూతురి దగ్గరకు వచ్చింది సరస్వతమ్మ. అర్పిత సోఫాలో కూర్చుని, తమ్ముడు చేతిలోంచి టీవీ రీమోట్ లాక్కుని వాడు చూస్తున్న ఛానల్ ని మార్చేసి, కప్పు అందుకుంది. రాంబాబు అక్క వంక గుర్రుగా చూసాడు.

"మొన్న పెళ్ళిచూపులకు వచ్చిన అబ్బాయి తండ్రి ఫోన్ చేసాడు...అమ్మాయి నచ్చింది, ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందాం అని" అంది సరస్వతమ్మ, కూతురితో.

"నాకు అబ్బాయి నచ్చలేదని చెప్పేయండి" అంది అర్పిత తాపీగా.

సరస్వతమ్మ తాడెత్తున లేచింది. "నచ్చలేదంటే అర్థమేమిటీ?"

"నచ్చలేదంటే...నచ్చలేదనే అర్థం!" అంది అర్పిత టీవీ స్క్రీన్ పైనుంచి దృష్టి మళ్ళించకుండా.

రాంబాబు నవ్వాడు. వాడి నెత్తిమీద ఒకటి వేసింది అర్పిత.

"అదే, ఎందుకు నచ్చలేదని అడుగుతున్నాను. కుర్రాడు లక్షణంగా ఉన్నాడు. సాఫ్ట్ వేర్ ఇంజనీరు. నెలకు రెండు లక్షల జీతం". అర్పిత మాట్లాడలేదు.

"ఇది ఏడవ సంబంధం. అందరూ పిల్ల నచ్చిందంటారు. నీకు మాత్రం ఎవరూ నచ్చలేదంటావు!" చిన్నగా నుదురు బాదుకుంది ఆవిడ. "అసలు నీకు ఎలాంటి మొగుడు కావాలో...అదీ చెప్పవు".

"ఏ మహేష్ బాబు, ప్రభాస్ లాంటి వాడు కావాలేమో!" నవ్వాడు రాంబాబు.

వాడి నెత్తిమీద చిన్నగా మొట్టింది అర్పిత.

"అలా జవాబివ్వకుండా నోర్మూసుక్కూర్చుంటే...ఏమనుకోవాలి?" కోపంగా అంది సరస్వతమ్మ.

"చేసుకునేవాడితో జీవితం పంచుకోవలసింది నేను. లక్షణంగా ఉన్నాడు, లక్షలు సంపాదిస్తున్నాడు అంటే సరిపోదు. నాకు నచ్చాలి!" అంది అర్పిత తొణక్కుండా.

"అదిగో, ఆ మొండితనమే వద్దనేది" సరస్వతమ్మ కోపం హెచ్చింది. "అసలు నీకు పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం ఉందా లేదా?"

"అక్క పెళ్ళికొడుకుతో మాట్లాడతానంటూ భేతాళ ప్రశ్నలేవో వేస్తోందని నా అనుమానం. వాటికి జవాబులు చెప్పలేక పరీక్షలో ఫెయిలవుతున్నారందరూ" నవ్వుతూ అన్నాడు రాంబాబు. అర్పిత చేయి ఎత్తడంతో అక్కడనుంచి తుర్రుమన్నాడు.

అక్కడే వున్న అర్పిత తండ్రి శ్రీనివాసరావు కలుగజేసుకుని, "పోనీలేవే. దానికి నచ్చినవాడు దొరికినప్పుడే పెళ్ళిచేసుకుంటుంది" అన్నాడు.

తోకతొక్కిన త్రాచులా లేచింది సరస్వతమ్మ. "మీరిలా వెనకేసుకు రాబట్టే అది అలా మొండిగా తయారయింది!"

"ఐనా దానికిప్పుడు ఏమంత వయసయిపోయిందనీ? మొన్న మాఘానికేగా ఇరవైరెండు వెళ్ళింది!" అంది అక్కడే కూర్చుని దూదితో ఒత్తులు చేసుకుంటున్న అర్పిత నాన్నమ్మ సుభద్రమ్మ.

సరస్వతమ్మకు ఒళ్ళు మండిపోయింది. "పందొమ్మిదేళ్ళకే కాపురానికి వచ్చాను నేను... అసలు నాన్న వత్తాసు, నాన్నమ్మ గారాబమే పాడుచేసాయి దీన్ని!" అంది ఉక్రోషంతో.

"దాని పెళ్ళి దాని ఇష్టం. మధ్యలో మేమేం చేసామే?" అని శ్రీనివాసరావు అంటే–

"ఇది మరీ బాగుంది! ఉరుము ఉరిమి పెనం మీద పడ్డట్టు...మమ్మల్ని ఆడిపోసుకుంటావేమే?" అంది సుభద్రమ్మ, కోడలిని. అర్పిత కిసుక్కున నవ్వింది. రాంబాబు కూడా అక్కతో జత కలిపాడు...

అర్పిత అందంగా, నాజూకుగా ఉంటుంది. కలువకన్నులు, లేత తమలపాకుల వంటి పెదవులూ ఆమె ప్రత్యేకతలు. ఎమ్బీయే చేసి ఓ ఎమ్మెన్సీలో హెచ్చార్ విభాగంలో అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తోంది. నెలకు యాభైవేల జీతం.

తండ్రి శ్రీనివాసరావు ఓ ప్రభుత్వ పాఠశాలలో గెజెటెడ్ హెడ్మాస్టర్ గా పనిచేస్తున్నాడు. తల్లి సరస్వతమ్మ ఓ సాధారణ గృహిణి. భర్తను కోల్పోయిన సుభద్రమ్మ కొడుకుతో ఉంటోంది. అర్పితకు, రాంబాబుకూ ఏడేళ్ళ తేడా వుంది. టెన్త్ క్లాస్ చదువుతున్నాడు వాడు...

ఆ రాత్రి అర్పిత పడుకుందేకానీ వెంటనే నిద్ర పట్టలేదు. ఆలోచనలు తేనెటీగల్లా ఝుమ్మని రేగాయి...తన పెళ్ళి గురించి అమ్మ పడే ఆరాటం చిరాకు పుట్టిస్తోంది తనకు. పెళ్ళికి తాను వ్యతిరేకి కాదు. అలాగని తొందరపడదలచుకోలేదు. ముఖ్యంగా తన కొలీగ్స్ అనుభవాలను గురించి ఆలకించాక.

ఆఫీసులో లంచ్ టైమ్ లో అమ్మాయిలందరూ కలసి లేడీస్ రూమ్ లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తింటారు. అప్పుడు వారి మధ్య వివిధ విషయాలు దొర్లిపోతుంటాయి. ముఖ్యంగా, వివాహితల సంభాషణ చిత్రంగా, ఆసక్తికరంగా ఉంటుంది. ఎక్కువగా కుటుంబాల గురించీ, భర్తల గురించే.

'ఏమే, మీ ఆయన ఇంటిపనిలో నీకు సాయం చేస్తాడా?' అని ఒకరూ...

'ఏమిటీ, నీ మొగుడు నీకసలు సాయమే చేయడా!?' అని మరొకరూ...

'నాలుగు రోజులు పక్కలోకి రానివ్వకుండా ఉంటే సరి!' అంటూ కిసుక్కున నవ్వేది ఇంకొకరూ...

-ఇలా వారి సంభాషణ భర్తలు, వారి స్వభావాలూ, కోపతాపాల పైన దొర్లిపోతుంది. ముఖ్యంగా, ఏ ఇద్దరు కలుసుకున్నా, 'మొగుడు ఇంటిపనిలో హెల్ప్ చేయడం గురించే' కావడం విశేషం!

అర్పిత సీనియర్ కొలీగ్ ప్రసూన భర్త ఓ మల్టీ-నేషనల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వారికి నాలుగేళ్ళ పాప వుంది. భర్త తనకు ఏ విషయంలోనూ సాయం చేయడని మొత్తుకుంటుంది. కనీసం పాపకు కూడా ఏమీ చేయడట. తాను మగమహారాజుననీ, ఇంటి బాధ్యత, పాప బాధ్యతా ఆమెదేనన్నట్టు ప్రవర్తిస్తాడట. ఇంట్లో ఉన్నంతసేపూ ల్యాప్ టాపో, సెల్ ఫోనో పట్టుకుని చాటింగులతో బిజీగా ఉంటాడట. ప్రసూన రోజూ ఐదు గంటలకు నిద్రలేస్తుంది. నర్సరీలో చదువుతున్న పాపను లేపి, తయారుచేసి, టిఫిన్ చేసి తినిపించి ఉరుకులు పరుగులతో స్కూల్ బస్ కి అందిస్తుంది. తరువాత తాను స్నానం చేసి వంట చేస్తుంది. భర్తకు బ్రేక్ ఫాస్ట్ పెట్టి, లంచ్ బాక్స్ సిద్ధం చేస్తుంది. తనకు ఆఫీసుకు టైమ్ అయిపోతే ఒక్కోసారి బ్రేక్ ఫాస్ట్ చేయకుండానే పరుగెడుతుంది.

భార్య చేసే అష్టావధానం, శతావధానం ప్రక్రియలను గమనిస్తూ నిమ్మకు నీరెత్తినట్టుగా వుంటాడట భర్త. విసుగెత్తి ఎప్పుడైనా అతని తీరు గురించి ఆమె మాట్లాడితే, 'ఇల్లు చక్కదిద్దుకోవడం భార్య బాధ్యత. అందుకే తనను ఇల్లాలు

అన్నారు!' అంటాడట నిస్సిగ్గుగా.

ఇక వైదేహి విషయానికి వస్తే- కొంతలో కొంత నయమనిపిస్తుంది. ఆమె భర్త తనంతట తానుగా ఏ హెల్పూ చేయడట. ఎప్పుడైనా ఏదైనా చెబితే, విసుక్కుంటూనే చేస్తాడట. దాంతో మళ్ళీ అతనికి ఏ పని చెప్పడానికీ మనస్కరించదట. పైగా, ఆఫీసులో తాను ఒక్కడే కష్టపడిపోతున్నట్టూ... ఆడవాళ్ళంతా చీరల గురించీ, నగల గురించీ, షోకుల గురించీ మాట్లాడుకుంటూ పని చేసేది తక్కువనీ, వాళ్ళు అలసిపోయేది ఏమీ వుండదనీ కామెంట్ కూడా చేస్తాడట. అతని మాటలకు ఒళ్ళు మండిపోయినా, 'డిస్క్రెషన్ ఈజ్ బెస్ట్ వేలర్' అన్నట్టు మౌనం వహించి అక్కణ్ణుంచి తప్పుకుంటుందట. వారికింకా పిల్లలు లేరు కాబట్టి ఎలాగో సర్దుకుపోతోందామె.

వారి సమస్యలను గురించి ఆలకించిన అర్పిత, 'ఏం మగాళ్ళు వీళ్ళు!' అనుకుంటుంది. 'తమతో సమానంగా ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆర్థికంగా చేదోడుగా ఉండే భార్యల శ్రమ, విలువ గుర్తించలేని ఆ భర్తల చదువులు ఎందుకు!...' అనుకుని విస్తుపోతుంది. 'వారిది కేవలం క్వాలిఫికేషనే గాని, ఎడ్యుకేషన్ కాదు!' అనిపిస్తుంది.

'పురుషులంతా అంతేనా!?' అన్న ప్రశ్న తేలుకొండిలా అప్పుడప్పుడు పొడుస్తుంటుంది అర్పితని. అందుకే పెళ్ళిచూపులకు వచ్చే అబ్బాయిల మనస్తత్వం గ్రహించడానికి ఓ ప్రశ్నను సంధించసాగింది. దానికి వారు ఇచ్చే జవాబు పైన తన జీవిత భాగస్వామి ఎంపికను ఆధారం చేసుకోవడానికి నిశ్చయించుకుంది...

సరస్వతమ్మ యొక్క సంకల్పబలమో, తన ప్రశ్నకు కోరుకున్న జవాబే దొరికిందో- ఆరు నెలల తరువాత అర్పిత వివాహం ఘనంగా జరిగింది. వరుడు కౌశిక్ ఆమెకంటే మూడేళ్ళు పెద్దవాడు. హ్యాండ్సమ్ గా ఉంటాడు. ఓ అమెరికన్-బేస్డ్ ఎమ్మెన్సీలో పనిచేస్తున్నాడు.

అది- వారి శోభనపు రాత్రి... పూలపాన్పుపైన భర్త ఒడిలో ఒరిగిపోయిన అర్పిత వదనంలో దోబూచులాడుతూన్న సిగ్గుదొంతరలు కౌశిక్ మదిలో పూలవర్షం కురిపించాయి. మనసుకు మత్తెక్కించాయి. ఆమె పల్చటి గులాబీ చెక్కిళ్ళపైన వెలుగులజిలుగులు పరచుకుంటే ఆమె సుందరవదనాన్నే వీక్షిస్తూ ఉండిపోవాలనిపించింది అతనికి. ఆ సౌందర్యం, సొగసులు తన సొంతం అనుకుంటే- ఆ మధురమైన తలపే అతని మదికి హాయి గొలుపుతూ ఆకాశవీధులలో తేలియాడించింది...సున్నితంగా ఆమె పెదవులపైన చుంబించబోయాడు. మధుపం వాలిన పూబోణిలా సిగ్గుతో మరింత ముడుచుకుపోయిందామె.

అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినవాడిలా ఆమెను గుండెలకు హత్తుకుంటూ అడిగాడు- "నాకంటే ముందు వచ్చిన పెళ్ళికొడుకులు ఎవరూ నీకు నచ్చలేదని మీ తమ్ముడు చెప్పాడు. మరి నాలో నీకు నచ్చినదేమిటో!?" అనడిగాడు మందహాసంతో.

ఓసారి అతని వదనంలోకి వీక్షించి మందహాసం చేసిందామె. అంతలోనే తన పెళ్ళిచూపుల పర్వం మదిలో మెదిలింది...పెళ్ళికొడుకులను 'భార్యకు ఇంటిపనుల్లో సాయం చేయడం విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?' అనడిగేది తాను.

'భలేవారే! ఇంటిపనులు భార్య బాధ్యత, బయటి పనులు భర్త బాధ్యతాను...' అన్నారు ఒకరు.

'ఆడవాళ్ళు చేసే పనులు మగవాళ్ళకు ఎలా వీలవుతాయండీ?' అన్నారు ఇంకొకరు తెలివిగా.

'అవసరమైతే తప్పదు కదండీ!' అన్నారు మరొకరు.

- అలా తలో రకంగా జవాబులు ఇచ్చారు అందరూ.

ఓ పెళ్ళికొడుకైతే, 'ఎస్, అయాం రెడీ టు హెల్ప్ మై వైఫ్' అన్నాడు దర్పంగా. అదేదో ఉదారకార్యంలా!

కానీ, ఒక్కరినుండీ తాను ఆశించిన సమాధానం మాత్రం రాలేదు! చిత్రంగా!!...

అదంతా జ్ఞప్తికి రావడంతో ఓ మందహాస రేఖ ఆమె అరుణాధరాల పైన తళుక్కుమంది.

"పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు...మనం ఏకాంతంగా మాట్లాడుకున్నాం. అప్పుడు నేనో ప్రశ్న వేసాను మిమ్మల్ని..."

"ఏం ప్రశ్నబ్బా? అది!?" బుర్ర గోక్కున్నాడు కౌశిక్. ఏమిటన్నట్టు ఆమె కళ్ళలోకి చూసాడు.

"భార్యకు ఇంటిపనుల్లో హెల్ప్ చేయడం విషయంలో మీ అభిప్రాయం ఏమిటి- అనడిగాను నేను..." చెప్పింది. "యా? యా?..." అన్నాడు గుర్తుకొచ్చినట్టుగా.

"అందుకు మీరు ఏం జవాబు చెప్పారో...ఓసారి జ్ఞప్తికి తెచ్చుకోండి" అంది, ప్రేమగా అతని వక్షంపైన వ్రేలితో రాస్తూ.

ఓ క్షణం ఆలోచించాడు అతను. ఓ నిముష తరువాత, "యా? యా?..." అంటూ ఆమె ప్రశ్నకు తానిచ్చిన సమాధానాన్ని ఓసారి నెమరువేసుకున్నాడు. పెద్ద జవాబే ఇచ్చాడు తాను, కించిత్తు ఎమోషనల్ గా- 'నో వే! భార్యకు భర్త హెల్ప్ చేయడమేమిటి? నాన్సెన్స్! సంసారం మనది. జీవితం మనది. కష్టసుఖాలలాగే, ఇంటిపనిని పంచుకోవడం- హెల్ప్ కాదు, బాధ్యత! భార్యాభర్తలంటే ఎవరు? నాగలికి కట్టిన జోడెడ్లు! అవి రెండూ సమాన బాధ్యతతో పనిచేస్తేనే అరక సులువుగా దున్నబడుతుంది. అలాగే సంసారనౌకలో దంపతులు కూడాను!'

అదే...అదే! అర్పిత ఎదురుచూసిన జవాబు! భార్యకు పనిలో చేదోడుగా ఉండడాన్ని ఓ గొప్ప 'హెల్ప్' గా భావించే ప్రబుద్ధుల మధ్య- కౌశిక్ లాంటివాడు ఆకాశంలో ధ్రువతారలా ప్రత్యేకంగా కనిపించాడు ఆమెకు.

"భార్యాభర్తలు ఓ అవగాహనతో ఎవరి వీలునుబట్టి వారు పనులను షేర్ చేసుకుని బాధ్యతాయుతంగా ప్రవర్తించినట్లైతే ఆ సంసారం సుఖమయమవుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చును. నన్నడిగితే మగపిల్లలను మొదటినుంచీ ఆ దిశగా మలచవలసిన బాధ్యత తల్లిమీద ఉందన్నది నా అభిప్రాయం" అన్నాడు అతను.

"అలవాటుపడ్డ స్టీరియో టైప్స్ వల్ల సమాజంలో మార్పు వస్తుందనుకోను. అసలు... పెంపకంలోనే ఆడ, మగ అన్న వ్యత్యాసం పోవాలి. భర్త భార్యకు 'హెల్ప్' చేస్తున్నాడా అన్న ప్రశ్న వేయడం మానుకోవాలి అందరూ. అలాగే భార్య తన సంపాదనతో భర్తకు సపోర్టుగా ఉంటోందా అన్న ఆలోచన కూడాను! మీరు అన్నట్లు- అది వారి సంసారం, వారి జీవితం. అందులో నీది నాది అన్న ప్రశ్నకు తావులేదు. దంపతులు వారి వారి వెసులుబాటును బట్టి తమ సంసారాలను, జీవితాలను మలచుకోవాలి..." సీరియస్ గా చెబుతూన్న భార్య వంక మురిపెంగా చూసాడు కౌశిక్.

"ఐ ఫుల్లీ ఎగ్రీ విత్ యూ, డియర్! మరి ఇక మన సెషన్ ఆరంభించుదామా?" అంటూ, తన పెదవులతో ఆమె పెదవులను మూసేసాడు.

మేను పులకించడంతో, 'మా ఆయన బంగారం...కాదు, కాదు...వజ్రం!' అనుకుంటూ, సిగ్గుతో అతని వక్షానికి అంటుకుపోయిందామె పరవశంతో.

★★★★★★

# రాదారి పాదాలు

సనాతని వెంకు

ఆకలి ఓ రోకలి పోటు
పస్తు ఈ బతుకుకి శిస్తు
రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి
రెక్కలు విరిచి దిక్కులకేసిందో రక్కసి

పరువే బరువై ఊరికి దూరమైంది
బతుకు
పనులే కరువై ఊసుకి దూరమైంది
మెతుకు
పెట్టె బేడా సర్దుకుని మూటాముల్లూ
కట్టుకుని
పిల్లాజెల్లాతో మొదలైంది మైళ్ళ ప్రయాణం

కదిలిన ప్రాణాలే అక్షర సత్యాలు
కమిలిన పాదాలే లక్షల సాక్ష్యాలు
పచ్చి బాలింతకు పట్టెడన్నం లేదు
పసిబిడ్డకు పాలెక్కడివి.?

ఏ చిత్రకారుని కుంచె గీచెనో
రాదారి పాదాల రక్తపు ఛాయలు
ఈ చైత్ర  మాసాన నేల రాలెను
గూటికి సాగిన గువ్వల గుంపులు

వరసపెట్టిన వలస బతుకును
కసురుకున్నవి ఆకలి కేకలు
అరచి అరచి అలసిపోయి
ఉసూరుమన్నవి ఊపిరి తీగలు

American Telugu Association
Passion For Our Culture, Compassion For Our People
అమెరికా తెలుగు సంఘం

# మనవడు

## జి వి రమణ

ఆ కాలనీలో పిల్లలందరికీ క్రికెట్ ఆడుకోవడానికి చాలా అనువుగా ఉండేది ఆ సందు ఒక్కటే. క్రికెట్ ఒక్కటే కాదు వేరే ఆటలకు కూడా ఆ సందే అనుకూలం, కానీ కులకర్ణి ఇల్లు ఆ సందు లోనే ఉంది. క్రికెట్ లాంటి బంతితో ఆడే ఆటలు ఆడేటప్పుడు ఆ బంతి పొరపాటున కులకర్ణి ఇంట్లో పడితే అంతే సంగతులు ఆ సమయానికి కులకర్ణి ఇంట్లో లేకపోతే ఫర్వాలేదు లేదంటే ఇంక ఆ బంతి బయటకు రాదు. బంతి లాంటి బట్టతల వేసుకుని కులకర్ణి బయటకు వస్తాడు.

"మీ ఆటలు ఇక్కడ కాదు గ్రౌండ్ కి వెళ్లి ఆడుకోమని ఎన్నిసార్లు చెప్పాలి? గంటల తరబడి ఈ వీధిలో చొరబడి పెద్ద పెద్దగా అరుస్తూ ఏమిటి మీ గోల ముందు ఇక్కడి నుంచి పొండి" అంటూ వీలైతే నాలుగు తిట్లు కూడా తిట్టి లోపలికి వెళ్లి గేట్ వేసుకుంటాడు.

ఎంత జాగ్రత్తగా ఆడినా బంతులు కూడా చాలా తొందరగా కులకర్ణి ఇంట్లోనే పడటానికి ఇష్టపడతాయి ఆ విధంగా ఇప్పటికి ఓ పది బంతులదాకా ఇరుక్కుపోయాయి.

ఆ విధంగా ఈ మధ్యకాలంలో పిల్లల బంతాటలు బాగా కుంటు పడ్డాయి. కావాలంటే కులకర్ణి చెప్పినట్టు అందరూ గ్రౌండ్ కి వెళ్లి ఆడుకోవచ్చు కానీ ఆ కాలనీకి గ్రౌండ్ దాదాపు రెండు కిలోమీటర్ల దూరాన ఉంది అంత దూరం వెళ్లి రావడం పెద్ద శ్రమ, పైగా అంతదూరం వెళ్లి రావడానికి బోలెడంత సమయం వృధా, అంత దూరం వెళ్లడానికి ఆడే వారిలో సగం మందికి బద్ధకం కూడా, ఒకవేళ ఎప్పుడైనా వెళ్ళినా అప్పటికే అక్కడ వేరే పిల్లల ఆటలతో అది నిండి ఉండేది.

కులకర్ణి ఉద్యోగరీత్యా కర్ణాటక రాష్ట్రం నుండి హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డ వ్యక్తి, ఆయనకు ఒక కొడుకు ప్రాణేష్, కోడలు మంజుల, రిటైరయ్యాక ఇదిగో ఈ వీధిలో ఇల్లు కట్టుకుని కొడుకూ కోడలితో ఉంటూ ఆ వీధిలో పిల్లలకి బంతులు మింగే రాక్షసుడిలా కనబడటం మొదలుపెట్టాడు.

ఈ నేపథ్యంలో ఆ రోజు ఉదయం ఈ కథ ప్రారంభమైంది.

రవి, దత్తు, రాఘవ, బెనర్జీ, సాయి, బాల, అశోక్, సుధీర్ అందరూ కలిసి రమణ ఇంటి ముందు గుమిగూడి రమణని బయటకు పిలిచారు. వీళ్ళందరూ 10 నుండి 15 సంవత్సరాల వయస్సు మధ్యలో ఉన్నవాళ్లే, వాళ్ల వాళ్ల తండ్రుల ఉద్యోగరీత్యా వివిధ రాష్ట్రాల నుండి హైదరాబాద్ వచ్చి సెటిల్ అయిన వాళ్లే. రమణ ఇల్లు కులకర్ణి ఇంటి ఎదురు ఇల్లె, ఎలాగైనా క్రికెట్ ఆడాలనే ఉద్దేశంతో అందరూ అక్కడ సమావేశమయ్యారు. రమణ బయటకు వస్తూనే, "ముసలాయన ఇంట్లోనే ఉన్నాడురా మనం ఆడటం వేస్ట్" అన్నాడు.

ఒక నిమిషం ఆగి మళ్ళీ తనే, "ఈ మధ్యన మంజుల ఆంటీ కూడా ఇక్కడ ఉండటం లేదురా, పుట్టింటికి వెళ్ళినట్టు ఉంది. ఆవిడ ఉంటే వాళ్ళందరూ బయటకి వెళ్ళినప్పుడు ఇంటికి తాళం వేసి, తాళం చెవి మా అమ్మకి ఇచ్చి మళ్లీ వాళ్లు ఎప్పుడు వస్తారో చెప్పేది. ఇప్పుడు ఈ ముసలాయనా, ప్రాణేష్ అంకులూ ఎప్పుడు బయటకు వెళ్తున్నారో తెలియడం లేదు మనం ఆట మొదలు పెట్టడానికి" అన్నాడు నిట్టూరుస్తూ.

"ఇవ్వాళ ఎట్టి పరిస్థితుల్లో ఆడి తీరవలసిందే, మనకి మళ్ళీ ఇప్పుడు అప్పట్లో సెలవులు కూడా లేవు" అన్నాడు దత్తు.

"ఏం కాదురా, ఏమన్నా అయితే ముసలాయనతో నేను మాట్లాడుతా" అన్నాడు రాఘవ. రాఘవ వాళ్లది బెంగుళూరు, వాడికి కన్నడం బాగా వచ్చు, ఆ ధైర్యంతోనే కులకర్ణి తో మాట్లాడుతాను అన్నాడు.

"అయినా వాళ్ళ ఇంట్లో పడకుండా జాగ్రత్తగా ఆడదాంలే" అన్నాడు అశోక్.

ఆ విధంగా అందరి అభిప్రాయాలు ఒక కొలిక్కి వచ్చాక ఏర్పాట్లు పూర్తి చేసి ఆట ప్రారంభించారు. దురదృష్టవశాత్తు ఫస్ట్ ఓవర్ పూర్తయ్యేలోపే సుధీర్ బ్యాటింగ్లో బంతి కులకర్ణి ఇంట్లో పడనే పడింది. ముందు అందరూ సుధీర్ని తిట్టారు.

"ఏమన్నా అయితే ముసలాయనతో మాట్లాడి బంతి తెస్తా అన్నావుగా, వెళ్లి తీసుకురా" అన్నాడు బాల రాఘవ నుద్దేశించి.

ఏదో గొప్ప కోసం అన్నాడు కానీ ఇంత తొందరగా అవసరం వస్తుందనుకోలేదు రాఘవ అయినా ఇచ్చిన మాట కోసం గేటు లోంచి లోపలికి వెళ్లి తలుపులోంచి లోపలికి చూసాడు. బంతి డైరెక్ట్ గా ఇంటి లోపలికి వెళ్లి తన దారికి అడ్డు వచ్చిన వస్తువులను కింద పడేసింది. ఆ శబ్దానికి అప్పటికే ఉగ్రరూపం దాల్చిన కులకర్ణి కుర్చీలోంచి లేస్తూ బయటికి రావడం కనబడింది రాఘవకి, అంతే క్షణం ఆలస్యం చేయకుండా గేటు బయటకు గెంతేశాడు.

మరుక్షణం ఎర్రబడ్డ కళ్లతో కోపంగా కులకర్ణి బయటికి వచ్చి పిల్లల్ని నాలుగు తిట్లు తిట్టి గేటు వేసుకొని వెళ్లి పోవడం జరిగింది. పిల్లలంతా ఉసూరుమంటూ అక్కడే అరుగుల మీద కూర్చుని మాటల్లో పడ్డారు ఆడుకోవడం కుదరక. ఇలా ఓ అరగంట గడిచాక చేతిలో సంచితో కులకర్ణి బయటకు వెళ్లడం కనబడింది పిల్లలకి. వెళ్లి ప్రాణేష్ ని అడిగి బంతి తెచ్చుకోవాలని ప్రయత్నించారు కానీ, ముసలాయన అనుమతి లేకుండా ప్రాణేష్ గానీ మంజుల గానీ పిల్లలకు బంతి తిరిగి ఇచ్చేవారు కాదు. ముసలాయనతో గొడవ అవుతుందని వాళ్ళు భయపడేవాళ్ళు. అందువల్లే పిల్లలు చేసిన ప్రయత్నం విఫలమైంది.

మళ్లీ ఉసూరుమంటూ అలాగే అరుగుల మీద కూలబడ్డారు.

"అరేయ్, రేపు దీపావళి పండుగ కదా, రేపు సాయంత్రం అందరం కలిసికట్టుగా టపాకాయలు తెచ్చి, పెద్ద పెద్ద బాంబులు ఇక్కడే కాలుద్దాం. ఆ శబ్దాలకి ముసలాడు ఏం చేస్తాడో చూద్దాం." కసిగా అన్నాడు రమణ.

"యస్, కరెక్ట్" అన్నాడు దత్తు.

మొత్తానికి అందరూ ఒక తీర్మానానికి వచ్చారు. ఇంతలో కులకర్ణి ఇంటి గేటు లోంచి ఓ దృశ్యం పిల్లల కంటపడింది.

ప్రాణేష్ ఇంట్లో నుంచి బయటికి వచ్చి ఇంటి ప్రధాన ద్వారానికి తాళం వేసి దాని చెవిని పక్కన ఉన్న పూల చెట్ల కుండీలలో ఒక దానిలో కనబడకుండా జారవిడిచి మొబైల్ ఫోన్ లో ఏదో కన్నడంలో చెప్పాడు, మధ్య మధ్యలో 'అప్ప', 'అప్ప' అంటుంటే అది వాళ్ళ నాన్నకి అయి ఉంటుందని వాళ్ళు అనుకున్నారు. తర్వాత ప్రాణేష్ కూడా పిల్లల్ని పట్టించుకోకుండా బయటికి వచ్చి గేటు వేసి వెళ్ళిపోయాడు.

"అరేయ్ ఇప్పుడు మనకి ముసలోడు దొరికాడు రా మనం వెళ్లి పూలకుండీ లోంచి ఆ తాళం తెచ్చేద్దాం. ఇదే ముసలోడికి సరైన శిక్ష" అంటూ రమణ ఆలస్యం చేయకుండా వెళ్లి తాళంచెవి తీసుకుని జేబులో వేసుకుని వచ్చేశాడు.

"తాళం తీసి లోపలికి వెళ్లి బంతులు కూడా తెచ్చుకుందాంరా" అన్నాడు దత్తు.

"అమ్మో వద్దురా దొరికామంటే దొంగల మంటూ మన వీపు పగలగొడతారురా" అన్నాడు రవి బెరుకుగా.

"ఈ శిక్ష చాల్లే ఇప్పటికి" అన్నాడు సుధీర్. ఏదేమైనా తాళం తీసి ఇంట్లో కి వెళ్లే ధైర్యం మాత్రం చేయలేకపోయారు. చేసుంటే నిజంగానే ఇరుక్కుపోయి ఉండేవాళ్ళు, ఎందుకంటే రెండు నిమిషాలు తిరిగేలోపే కులకర్ణి ఇందాక తీసుకువెళ్ళిన సంచితో కూరగాయలు తీసుకొని తిరిగి వచ్చాడు. లోపలికి వెళ్లి పూల కుండీలో తాళం చెవి కోసం వెతికాడు. మొబైల్లో కొడుక్కి ఫోన్ చేసి ఏదో

మాట్లాడాడు, అదేమిటో పిల్లలకు సరిగా అర్థం కాలేదు. తర్వాత కోపంగా ముఖం పెట్టి ఏదో లోలోపల తిట్టుకుంటూ తిరిగి బయటకు వెళ్ళిపోయాడు. పిల్లలు ఏదో తెలియని ఆనందంతో కేరింతలు కొట్టారు. అప్పటికి బాగా ఆలస్యం కావడంతో పిల్లలందరూ ఎవరి ఇళ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు. రమణ కూడా తాళంచెవి లాగు జేబులో వేసుకున్న విషయం మర్చిపోయి బాత్రూంలోకి వెళ్లి అక్కడ విడిచి పడేసి స్నానం పూర్తి చేసి వేరే బట్టలు కట్టుకుని పక్క వీధిలో ఉన్న సుధీర్ వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయాడు.

అప్పుడు జరిగిందది - సాయంత్రం ఐదు గంటల సమయంలో కులకర్ణి, ఆయన కొడుకు ఒకేసారి ఇంటికి తిరిగి వచ్చారు. ప్రాణేష్ తాళం చెవి కోసం వెతికాడు, ఊహూ, ఏ పూలకుండీలోనూ అది లేదు. పెద్దాయనకు బాగా కోపం వచ్చింది.

ప్రాణేష్ చుట్టుపక్కల ఇద్దరు ముగ్గురు ఇళ్ళ నుండి వాళ్ళ తాళం చేతులు అడిగి తీసుకుని వాటన్నింటితో ప్రయత్నించగా ప్రయత్నించగా మొత్తానికి అది తెరుచుకుంది. పెద్దాయన ప్రాణేష్ ను బాగా తిట్టాడు. ప్రాణేష్ కూడా చుట్టుపక్కల వాళ్ళ ముందు పరువు పోతోందని తిరిగి వాళ్ళ నాన్నని బాగా గట్టిగా అరిచాడు.

ఎదురుగానే ఉండడంతో రమణ వాళ్ళ అమ్మ ఇదంతా గమనించింది, “నాకు ఇచ్చి ఉంటే సరిపోయేది కదండీ” అంది అనునయంగా.

“తప్పు నాదే” అంటూ ప్రాణేష్ రమణ వాళ్ళ తాళం చేతులు వాళ్ళ అమ్మకి తిరిగి ఇచ్చేసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

ఇదంతా జరిగిన కాసేపటికి రమణ తిరిగివచ్చాడు. ఎదురింట్లో తండ్రి కొడుకులను చూసి, ‘తాళం ఎలా తీశారబ్బా?..... ఆఁ .... పగలగొట్టి ఉంటారులే’ అని ప్రశ్న, జవాబు రెండూ తనే అనుకున్నాడు. తను చేసిన పనికి మర్నాడు తనకి శిక్ష పడబోతోందని రమణకి ఆ క్షణం తెలీదు.

తెల్లవారింది, ఆ రోజే దీపావళి పండుగ!

రమణ వాళ్ళ అమ్మ ఆ రోజు బట్టలు ఉతికేటప్పుడు రమణ లాగు జేబులో తాళంచెవి కనపడింది. అది ఎదురింటి వాళ్ళది అని అర్థమయింది. మంజుల చాలాసార్లు ఆ తాళంచెవి తనకి ఇచ్చి వెళ్లి ఉండటంతో, దాన్ని వెంటనే గుర్తు పట్టగలిగింది. అంతే, వెంటనే రమణని పిలిచి అడిగింది,"ఈ తాళంచెవి నీకు ఎక్కడిది? "

“ఎదురింటి ముసలాయన మా బంతులన్ని తీసుకుంటుంటే ఆయనకి బుద్ధి చెప్పాలని.....” రమణ మాట పూర్తికాకముందే వాళ్ళమ్మ ప్రక్కనే ఉన్న ఒక బెత్తం తీసుకుని, “పెద్దంతరం చిన్నంతరం లేకుండా తాత గారి లాంటి వాడిని ముసలాయన అంటావా, అదిగాక ఇలాంటి దొంగతనాలు చేస్తావా?” అంటూ ఒక్కటి అంటించబోయింది, అక్కడే ఉంటే ప్రమాదమని రమణ వాకిట్లోకి పరిగెత్తాడు. అయినా ఆవిడ వాణ్ని వదలకుండా వెంబడించి పట్టుకొని,” మళ్ళీ ఇలాంటి పని చేస్తావా? “అంటూ బాగా కొట్టడం మొదలు పెట్టింది, వాడు పెద్దగా “వద్దు వద్దు వద్దు వద్దు” అంటూ అరుస్తూ ఏడుపు లంకించుకొన్నాడు.

రమణ అరుపులూ ఏడుపూ గట్టిగా వినిపిస్తుండటంతో ప్రాణేష్, ఆ వెనకే కులకర్ణి బయటికి వచ్చారు, “ఎందుకండీ మీ అబ్బాయిని అలా కొడుతున్నారు, ఏం చేశాడు?” అని అడిగాడు ప్రాణేష్.

“వీడు... వీడు...” అంటూ ఇంకో నాలుగు దెబ్బలు తగిలించింది కానీ ఎందుకు కొడుతోంది మాత్రం చెప్పలేదు ప్రాణేషే గబగబా వచ్చి రమణకి దెబ్బలు తగలకుండా పక్కకి లాగేసాడు. రమణా వాళ్ళ అమ్మ లోపలికి వెళ్ళిపోయింది. ‘బ్రతుకు జీవుడా!’ అనుకున్నాడు రమణ.

‘ఏదో ఇంట్లో గొడవ అయ్యుంటుందిలే’ అనుకుంటూ ప్రాణేష్ తిరిగి వెళ్ళిపోయాడు.

“ఈ తాళంచెవి తాత గారికి తిరిగి ఇచ్చి సారీ చెప్పి రా, ఇంకోసారి ఇలాంటి పని చేస్తే నిన్ను వదిలేది లేదు” అంటూ తాళంచెవి రమణ చేతికిచ్చింది వాళ్ళమ్మ.

చేసేదిలేక రమణ వెళ్లి తాళంచెవి కులకర్ణి చేతిలో పెట్టి, “సారీ తాత గారు” అన్నాడు ముక్కులు ఎగజీలుస్తూ.

“ఇంతకీ ఏం జరిగింది? “అని ప్రాణేష్ అడిగిన ప్రశ్నకు, అమ్మ కొట్టిన దెబ్బలు సలపరిస్తుండటంతో ఏడుస్తూ జరిగిందంతా చెప్పి, వళ్ళు సవరించుకుంటూ వచ్చేశాడు రమణ.

తాతగారూ అన్న రమణ సంబోధన కులకర్ణి మనసులో దేన్నో తట్టినట్లయింది. ధైర్యంగా తాతగారిని బంతులు తిరిగి ఇవ్వమని అడగలేని వాడి హృదయం పడే వేదన, వాడి కన్నీటి రూపంలో వెక్కిరిస్తున్నట్లనిపించింది. తన పట్టుదల వాడి ఒంటి సలపరింతలై ఏడిపించినట్లు ఉంది. కులకర్ణి మనసెందుకో భారంగా మూలిగింది, ‘వీడే నా సొంత మనవడై ఉంటే ఈరోజు వాడి వొళ్ళు ఇలా వాతలు తేలేదా?’

★★★★

ఆ రోజు సాయంత్రం రమణ ఇంటి ముందు పిల్లలందరూ దీపావళి బాంబులతో గుమిగూడారు,

పిల్లలందరూ ఒక చోట చేరడం చూసి కులకర్ణి తన ఇంట్లో దాచిన బంతులన్నీ తెచ్చి రమణ చేతిలో పెట్టి, “హాయిగా ఆడుకోండి — ఇంకెప్పుడూ దొంగ పనులు చేయకండి” అంటూ ఇంట్లోకి వెళ్లి కొన్ని దీపావళి టపాసులు కూడా తెచ్చిచ్చి బంతి లోపలికి రాకుండా తలుపు వేసుకున్నాడు.

పిల్లలకు నిజమైన దీపావళి వచ్చినట్లు అనిపించింది. పెద్ద బాంబులు పక్కన పారేసి, ఆట పూర్తయ్యాక కులకర్ణి ఇచ్చిన టపాసులతో పండుగ చేసుకున్నారు.

ఇప్పుడు తాతగారూ అని పిలుస్తున్న రమణ, మనవడిలా కనిపిస్తున్నాడు కులకర్ణికి.




# ప్రజాస్వామ్య ప్రాణవాయువు

**భైతి దుర్గమ్**

ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు
పవిత్ర ప్రాణవాయువు
సమర్థులను ఎంచుకునే
సామాన్యుల వర ప్రసాదం
నిరంకుశులను నిలువునా కూల్చే
బ్రహ్మాస్త్రమే ఈ ఓటు
మత్తు పానీయాల కు
ధన   వస్తు ప్రలోభాలకు
దౌర్జన్య బెదిరింపులకు
అవకాశవాద రాజకీయాలకు
ఎదురునిలిచి ప్రయోగించే
ప్రజల స్వేచ్ఛాయుధము
అతివలను సామాన్యులను
అందలమెక్కించే సోపానం
ఆవినీతి పరులను పాతాళానికి
దిగజార్చే సాధనం
వినియోగించే సక్రమ ఓటు
మన దేశ ప్రగతికి మహా శక్తి




SIDDHENDRA KUCHIPUDI ART ACADEMY
FOUNDER AND ARTISTIC DIRECTOR: SWATHI ATLURI-GUNDAPUNEEDI
PHONE: 732-429-2948
EMAIL: SIDDHENDRAKUCHIPUDI@GMAIL.COM
WWW.SIDDHENDRAKUCHIPUDIARTACADEMY.COM
HTTPS://WWW.FACEBOOK.COM/SIDDHENDRAKUCHIPUDI

# అశ్రుకణం

## పి. వి. శేషారత్నం

అది కోవిడ్ సోకిన ఎనిమిదిమంది పేషంట్ల జనరల్ వార్డు అయివుండాలి. నర్సు ఆయాతో బాటు అందరూ ముఖాలకు తెల్లని మాస్కులు ఒంటికి పిపియి కిట్లతో రాకెట్‌లోంచి చంద్రమండలంమీదకు దిగుతున్న వాళ్లల్లా కనిపిస్తున్నారు.

ప్రతి బెడ్ చుట్టూ ఒక తెర ఉంది.

కొందరు పేషంట్లు మాస్కు వెనకనుంచే సెల్‌ఫోన్‌లో వాళ్ల వాళ్లతో మాట్లాడుకుంటున్న మాటలు . . . కొందరు కుటుంబీకులు పంపించే బిస్కెట్లు పళ్లు తింటూ తమవారిని తలుచుకుంటూ బాధపడే మాటలు . . . , ప్రపంచానికి అయినవాళ్లకి దూరంగా విసిరేసినట్టు ఒంటరి భావనతో 'ఇంకా ఇక్కడ ఎన్నాళ్లో ' అనుకుంటూ కొందరు విడిచే నిట్టూర్పులు . . . కళ్లు మూసుకున్నా నాకు వినిపిస్తూనే ఉన్నాయి.

నా ముఖానికి తగిలించిన ఆక్సిజన్ మాస్కులోంచి చల్లగా ఊపిరి అందుతోంది.

కొందరు పేషంట్లు అప్పుడప్పుడూ ఆక్సిజను మాస్కును ప్రక్కకు తొలగించుకుని పరస్పరం మాట్లాడుకోవడం కూడా నాకు తెలుస్తోంది.

కిట్ ధరించి మా పొట్టకి గబగబా ఇంజక్షన్ చెయ్యడానికి వచ్చే నర్సు సాయంతో ఆన్‌లైన్లో ఏదో సమయంలో పేషంటు పరిస్థితిని అంచనా వేసేందుకు కాబోలు ఓ క్షణం పలకరించే ముక్కూ మూతీ మూసుకున్న జూనియర్ డాక్టరు, . . భయం భయంగా ఐదే ఐదునిమిషాల్లో బాత్‌రూం క్లీన్ చేసి పారిపోయే బోయ్ తప్ప రోజంతా ఎవరూ కనిపించక ఒక పేషంటు, 'ఈ అంతస్థునుంచి దూకి చచ్చిపోవాలనుంది' అని ఏడ్చిన ఏడుపు కూడా పెద్దగా నన్ను కదిలించలేదు.

మహమ్మారి సోకకుండా నిత్యం ఎన్నో జాగ్రత్తలు తీసుకునే వ్యాపార సామ్రాజ్య చక్రవర్తినయిన నాకు కరోనా రావడమే ఆశ్చర్యం. వచ్చినా అతి సామాన్యునిలా ఈ చిన్న ఆసుపత్రిలో ఎందుకున్నానో?

అసలు నన్ను ఇక్కడ చేర్చినవారెవరో? నేను ఇక్కడకి వచ్చి ఎన్నిరోజులయిందో తెలియదు. అడిగినా సమాధానం చెప్పడానికిక్కడ ఎవరూ లేరు.

నాకేమయిందో తెలియదుగానీ అప్పుడప్పుడూ గాఢ నిద్ర. . . ఉన్నట్టుండి మెలకువ వస్తూ ఉంటుంది.

' అసలు నేనున్నది కలలోనో వాస్తవంలోనో తెలియని స్థితి.

అదిగో ఇంతలోనే ఏదో స్వప్నమే కాబోలు నన్నావరిస్తోంది.

అబ్బ ఈ వాతావరణం ఎంత ప్రశాంతంగా ఉంది?

పచ్చని పారిజాత వృక్షం క్రింద ఒత్తుగా రాలిన ఎర్రని కాడల తెల్లని పారిజాతాలు. . .

నిండు యవ్వనంలోని ఒక స్త్రీ మధుర కంఠం గాలి అలలపై పయనిస్తున్నట్టు తెరలుతెరలుగా వినిపిస్తోంది.

ఇది. . . నేను చాలాకాలం క్రితం ఎంతో మనసుపడిన కంఠం. . . అచ్చం పరిమళ పాడుతున్నట్టే వుంది.

అప్పట్లో . . . . చేతినిండా డబ్బు. . . . సరదాగా తనివితీరా స్వేచ్ఛగా జీవితాన్ని అనుభవించాలనే వయసు నాది.

ఒద్దికగా ఓర్పుగా బాపు బొమ్మలా కనిపించే పరిమళ నన్ను ప్రేమిస్తూ తిరుగుతుంటే గర్వంతో నా భుజాలు పొంగేవి.

ఆమె నాది. ఆమె అందం నాకే సొంతం. . . అన్న భావన నాకెంతో థ్రిల్‌నిచ్చేది.

'జగన్! ఈ ప్రేమా దోమా అంతా ట్రాష్. కాంట్రాక్టర్ రాఘవరావుగారమ్మాయి అనూరాధ మనస్థాయికీ నీకూ అన్నివిధాలా సరిపోతుంది. నువ్వెళ్లి ఆ ప్రేమించానంటున్న పిల్ల వ్యవహారం ఏదో కాస్త డబ్బు పారేసి సెటిల్ చేసుకొచ్చెయ్. '

'పరిమళని ప్రేమించాను' అనగానే మాడాడీ అన్న ఆ మాటకు ఆశ్చర్యపోలేదు నేను.

ఆయన కాదన్నందుకు పెద్దగా బాధకూడా పడలేదు. ఎందుకంటే ముమ్మూర్తులా ఆయన లక్షణాలను పుణికి పుచ్చుకున్నాను నేను.

ఆయనలాగే 'ప్రేమ, దోమ, త్యాగం. . . ఇవన్నీ బ్రతకడం చేతగాని పిరికివాళ్లు పట్టుకుని వేలాడే పిచ్చి పదాలు. " అనే నమ్ముతాను.

అయితే పరిమళ విషయంలో నాకో బలహీనత ఉంది అని ఒప్పుకోవడానికి సిగ్గుపడను నేను. . .

పరిమళ నాతో తప్ప ఎవరితోనయినా మాట్లాడితేనే సహించలేను నేను. అయితే నేను పెళ్లి చేసుకోనంటే. . . ఆతర్వాత ఆమె ఎవరినో చేసుకుని సంసారం చేస్తోంటే సహించగల సహనం నాకు లేదు. అందుకే ఆవేశంగా పరిమళ దగ్గరకి పరిగెత్తాను.

'పరిమళా! మన పెళ్లికి మా డాడీ ఒప్పుకోవడం లేదు. మనం గుళ్లో పెళ్లి చేసేసుకుందాం రా. '

'జగన్! మీ డాడీకేకాదు, నిన్ను చేసుకోవడం నాకూ ఇష్టంలేదు. ఎందుకంటే మనిద్దరి మనస్తత్వాలు వేరు. . . మనకి పెళ్లి పొసగదు. నన్ను అర్థం చేసుకుంటావను కుంటాను. '

కన్నతండ్రిని కూడా కాదని రహస్యంగా పెళ్లిచేసుకుంటానన్న నాత్యాగపూరితమయిన మాటలకి ఎగిరి గంతేస్తుందనుకున్న పరిమళ తాపీగా చెప్పిన ఆ సమాధానం నా అహాన్ని దెబ్బతీసి నా కోపం నసాళానికంటింది.

'పొసగదని ఇపుడు తెలిసిందా? ఏం చూసుకుని నీకు పొగరు?'

ఆ నిందకి ఆమె ఏమీ పౌరుషపడి ఎదురు తిరిగి మాట్లాడకపోవడం ఇంకా అవమానంగా అనిపించింది.

ఉడికిపోతూ నాలుగు రోజులు వరుసగా ఆమెను గమనించాను. నా ఊహ నిజమే. నా ప్రాణ స్నేహితుడు రాజాని కలుస్తోంది. వాళ్లిద్దరు పార్కులో కూర్చుని మాట్లాడుకోవడం. . . మధ్యమధ్యలో పరిమళ కళ్లు తుడుచుకోవడం. . . వాడు ఓదార్చడం. . . నాకు మనసు రగిలిపోయింది.

వాళ్లిద్దరూ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటే నేను

కళ్లప్పగించి చచ్చు సన్నాసిలా. . . నో. . . అలా జరగడానికి వీల్లేదు.

మళ్లీ ఆమె దగ్గరకి వెళ్లాను.

'ఇప్పటివరకు నువ్వు వాడితో తిరిగి చెడిపోయినా ఫరవాలేదు. నువ్వు నాకే సొంతంకావాలి తప్ప వాడిని పెళ్లి చేసుకుంటే మాత్రం నేనొప్పుకోను. '

నా మాటలకి ఆమె విస్తుపోలేదు.

కానీ ఆమె కళ్లల్లో ఎంత నిరసన?

ఆతర్వాత నామనసు నా అధీనం తప్పిపోయింది.

ఫలితం. . . వరుసగా అనుకోని సంఘటనలు. . .

ఆఫీసునుంచి ఒంటరిగా ఇంటికి వెళ్తున్న పరిమళ దారి కాచి. . . ఎవరూ లేని చోట. . . నన్ను ఆమె గుర్తించేలోగానే చేతిలోని యాసిడ్ సీసాతో నేను దాడి చెయ్యడం. . . ఆమె అరుస్తూ కుప్పకూలిపోవడం. . . నేను పరారీ కావడం. . .

తర్వాత పరపతిగల నాతండ్రి ఆసమయంలో నేను వేరే ఊళ్లో ఉన్నట్టు ఎలిబీ సృష్టించడంవల్ల చాలారోజులు కోర్టులో ఆ కేసు రకరకాలుగా నలిగిందని మాత్రం తెలిసింది.

ఎందుకంటె ఆతర్వాత నేను చాలాకాలం పాటు ఆ ఊరు వదిలేసి వేరే ఊళ్లో డాడీ బిజినెస్ అందుకున్నాను.

తర్వాత అనూరాధతో అంగరంగ వైభోగంగా నా పెళ్లి. . . ఆతర్వాత ఒక కొడుకుకి కూతురికి తండ్రినయ్యాను.

కాలం పాతికేళ్లని ఇట్టే మింగేసింది.

నా కూతురు సుధ ప్రేమగోలకి నాదైన శైలిలో ముక్తాయింపునిచ్చి ఆకాశమంత పందిరివేసి నాస్థాయికి సరితూగే నాకిష్టమైన వ్యక్తితోనే దానిపెళ్లి చేసాను.

కానీ . . . నాయిష్టానికి వ్యతిరేకంగా నా కొడుకు ఒక అనాధను పెళ్లాడాడు.

ఆతర్వాత ఇటీవలే అనుకోకుండా నా భార్య అనూరాధ మరణం. . .

గతస్మరణతో నాకు ఊపిరి తియ్యడం కష్టమై వాస్తవంలోకి వచ్చాను.

ఆసమయంలో నర్సు లేనందున నేను నిద్రలో ఒత్తిగిలడంలో పక్కకు జరిగిన ఆక్సిజను మాస్కును మళ్లీ నేనే తగిలించుకున్నాను.

వార్డులో మాటలు వినిపిస్తున్నాయి.

పక్క పేషంటు కాస్త ఆసుపత్రి వాతావరణానికి అలవాటు పడ్డట్టున్నాడు.

ఎవరిచ్చారోగానీ ఆనాటి దినపత్రికలో వార్తల ను పైకి చదువుతున్నాడు.

'ప్రేమోన్మాదంతో యువతి గొంతు కోసి. . . తప్పించు కున్న వ్యక్తి కటకటాలపాలు. . . . '

"అబ్బబ్బ ఈమధ్యకాలంలో పేపర్లలో రోజూ ఇవే వార్తలు, . . దొరికినవాడిని దొరికినట్టే నడిరోడ్డులో ఉరి తీస్తే సరి. కుర్రకారుకి బుద్ధొస్తుంది. "

అతను పేపరు విసిరి కొట్టాడు.

అతని అజ్ఞానానికి నవ్వు వచ్చింది.

'మరి నాలాగా దొరకనివాడినేంచెయ్యగలరో?

అసలు ప్రేమ అన్నదే మహామాయ. . . అందులో పడ్డవాళ్లు శ్లేష్మంలో ఈగల్లా కొట్టుకు ఛావాల్సిందే. . .

'దేవుడున్నాడండీ! అందుకే దొరికిపోయాడు. ' అన్నాడు ఇంకో పేషంటు.

మరి నేను దొరికిపోలేదంటే దేవుడు లేనట్టేగా! అసలు నాగురించి తెలిస్తే వాదించుకునే వీళ్లిద్దరూ ఎలా రియాక్టవుతారో? అసహ్యించుకుంటారా? కోపగిస్తారా? అయినా జనం భావాలతో నాకు పనేమిటి?

బలమైన నిట్టూర్పు తన్నుకుంటూ బయటికొచ్చింది.

ఎందుకో మళ్లీ ఊపిరి చాలినట్టనిపించడం లేదు.

ఇంత డబ్బు అధికారం ఉన్న నాకు ఎందుకీ ప్రపంచం వెలితిగా అనిపిస్తోంది?

నా కొడుకు. . . నన్ను కాదని తను కోరుకున్న పిల్లను . . . . అదీ ఒక అనాధను పంతం పట్టినట్టుగా నాకు కోడలిని చేసి కుటుంబ గౌరవం మంటగలిపాడనా? కాదుకాదు. . . కూతురు కూడా పెళ్లయి వెళ్లిపోయిందనా?

భార్యపోయి ఇపుడు నేను పూర్తిగా ఒంటరి వాడినయిపోయాననా? కాదుకాదు. . . అంతకు మించినదేదో???

మాస్కు సరిజేసుకున్నాను. . . ఇప్పుడు ఊపిరి బావుంది.

నీరసంగా కళ్లు మూసుకున్నాను.

చాలాసేపటితర్వాత బయట ప్రపంచంలో మళ్లీ ఎవరో మాట్లాడుతున్నట్టు వినిపించి కళ్లు సగం తెరిచాను.

నాలుగో బెడ్ ఖాళీ అయినట్టుంది. అక్కడి వ్యక్తి మరణించి పొట్లంలా చుట్టబడి తీసుకు పోబడ్డాడా లేక కోవిడ్ తగ్గి డిశ్చార్జి అయ్యాడా?ఏమో? ఇప్పటికి ఇలా నాలుగు పొట్లాలు వెళ్లాయి.

ఎవరు రానిచ్చారో. . . ఎలా వచ్చాడో. . . కాషాయవస్త్రాలతో ఎవరో స్వామీజీ మాస్కుతో వార్డులోకి వచ్చారు.

ఆయన మాట్లాడుతుంటే తక్కిన పేషంట్ల ముఖాల్లో ఏదో ఉత్సాహం, ఊరట. . .

కోవిడ్ పేషంట్లకు మనోధైర్యం ఇచ్చేందుకు ఆసుపత్రి వారి కోరిక మేరకు ఈ వారణాసిలోని శాంతి ఆశ్రమం స్వామీజీ అప్పుడప్పుడు ఇలా వచ్చి ఊరట ధైర్యం కల్పిస్తుంటారని చెప్పుకుంటున్నారు తక్కిన పేషంట్లు.

అసలు డాక్టర్లే వార్డులోకి రాకుండా ఫోన్‌లో మాట్లాడుతుంటే. . . ఈ సన్యాసికి ఎవరూ లేరేమో . . . అందుకే కోవిడ్ అంటే భయం లేకుండా మా మధ్యలోకి వచ్చి మాట్లాడుతున్నాడు.

నాకు మాత్రం ఇన్నాళ్లుగా కోవిడ్ అంటే హడల్ ! అందుకే డబ్బు గుప్పించి నా యింటిని కోటగోడలా సురక్షితం చేసుకోవడమేకాదు, అహర్నిశలూ డాక్టర్ల సలహాతో ఎన్ని జాగ్రత్తలు తీసుకోలేదూ? ప్చ్ ఏం లాభం?

నల మహారాజుకి పాదప్రక్షాళనంలో కాసింత తడవని స్థానంనుంచి కలిపురుషుడు ప్రవేశించి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసినట్టుగా ఎక్కడనుంచి నాశరీరంలోకి దూరిందో పాడు కరోనా!

ఇంతలో ఒక నర్సు వచ్చి కరడుకట్టిన మొహంతో రోబోట్‌లా చకచకా మా అందరి పొట్టలకు ఇంజక్షన్లు పొడిచేసి ఐదోనంబరు పేషంటుకి గూక్లోజ్ తగిలించి కొందరికి ఆక్సిజను

మాస్కు తగిలించి ఎవరో తరుముతున్నట్టు హడావుడిగా వెళ్లిపోయింది.

ఎంత పొట్టకూటికోసం ఉద్యోగం చేస్తున్నా ఈరాక్షస జబ్బు అంటుకుంటుందేమోనని ప్రాణభయం కదా!

ఈమె పదిరోజులుగా వస్తున్న నర్సు కాదని మాత్రం గుర్తించాను. ఆవిడ బక్కపలచగా ఉంటే ఈవిడ కాస్త బొద్దుగా వుంది.

పాత నర్సు కళ్లల్లో నా ఆక్సిజన్ మాస్కు సరిచేస్తున్నపుడు ఎంతో కరుణ జాలి ప్రేమ కనిపించేవి.

ఈ నర్సు వెళ్లాక మాస్కు వెనుక నుంచే స్వామీజీ పేషంట్లకి జీవన రహస్యాన్ని వివరించాడు.

'మనం చేసే చర్య, ప్రతిచర్యల గొలుసు మనం చేసే కర్మే. కొన్ని కర్మలు. . . వాటి ఫలాలను ఈజన్మలోనే అనుభవానికి వస్తాయి. . . . నేరస్థుడికి న్యాయస్థానం శిక్ష విధించిందీ అంటే అర్థం. . . ఈజన్మలోనే అతడు కర్మఫలాన్ని పొందినట్టు. . . శిక్ష అతడికి సరైనది కాకపోతే, శిక్షపడేలోగానే అతడు మరణిస్తే కర్మఫలం వచ్చే జన్మకు బదిలీ అవుతుంది అన్నమాట . '

ఆయన మాటలు అందరినీ ఆలోచింపజేస్తున్నట్టుగా వింటున్న వాళ్ల వదనాల్లో ఎంతటి ప్రశాంతత?

మరి వ్యాపారంలో మకుటం లేని చక్రవర్తిగా నిలిచిన నాకు శాంతి కలక్క పోగా కత్తులతో కోస్తున్నట్టున్నాయేంటి?

నాభార్య అనూరాధ చనిపోతూ ఒక ఉత్తరాన్ని నా చేతిలోపెట్టి కాశీలో తన అస్థినిమజ్జనం చేయమని కోరడం గుర్తొచ్చింది.

"మిమ్మల్ని ఏమని సంబోధించేందుకూ నాకు మనసు రావడం లేదు. మీరు నా భర్త అనే గౌరవాన్ని. . ఆమధ్య నా కంట బడిన మీ పాతడైరీలు తునాతునకలు చేసాయి. పరిమళవంటి ఒక అమాయకురాలిపట్ల మీ అమానుషచర్య తెలిసి. . . ఇన్నేళ్లు మీతో సంసారం చేసినందుకు సిగ్గుతో చితికిపోయాను. నాకు బ్లడ్‌కాన్సర్ అని తెలిసినా మీనుండి దాచింది అందుకే . . . . . 'మీకు ఏమీకాని అనూరాధ' తలలో నరాలు అదిరిపోయాయి నాకు. ఇన్నేళ్లుగా అహంభావంతో నేను నన్ను మాత్రమే ప్రేమించుకుంటూ కడుపున పుట్టిన పిల్లల దృష్టిలోనే కాదు, కట్టుకున్న ఇల్లాలి మనసులో కూడా స్వార్థపరుడిగా మిగిలిపోయానా?

+ + +

మెలకువ నిద్రల మధ్య ఊగిసలాడే నాకు రాత్రి పగలూ ఒక్కలాంటివే అయినా ఆ రాత్రి నిశ్శబ్దం నన్ను మరీ భయభ్రాంతుడిని చేసింది. బాగా తెలివి వచ్చి అసహనంగా కళ్లు తెరచి చూస్తే తక్కినవారంతా గాఢనిద్రలో ఉన్నారు.

స్వామీజీ ఇంకా వార్డులోనే పచార్లు చెయ్యడం ఆశ్చర్యం కలిగించింది.

ఇది కలా వాస్తవమా?

ఆయన వెళ్లిపోకుండా ఇక్కడే ఎందు కున్నాడు? కొంపదీసి అతనూ కోవిడ్ పేషంటేనా?

'స్వామీజీ. . . నమస్కారం. . . '

ఎలాగో నా గొంతు పెగిలింది.

ఆయన ఉలిక్కిపడి నావైపు తిరిగాడు.

బెడ్‌లైటు వెలుగులో అతన్ని దగ్గరగా చూసి నేను ఇంకా ఉలిక్కిపడ్డాను.

అతడు . . . ఆ స్వామీజీ. . . ఒకనాటి నా ప్రాణ స్నేహితుడు. . . రాజా!!!

నా కంఠంలో ఆశ్చర్యం. . .

'అదేంటి భయంలేకుండా ఇక్కడ ఆసుపత్రిలో? నువ్వు పరిమళను పెళ్లి చేసుకోలేదా?'

అతని కంఠం శాంతంగా పలికింది.

'పరిమళ మనస్ఫూర్తిగా ప్రేమించింది నిన్నయితే నన్నెందుకు చేసుకోవాలి? జగన్! నీ స్వార్థపూరిత ప్రవర్తనతో ఆమె మనసుని నువ్వెంత ముక్కలు చేసావో నీకు తెలీదు. సీతాకోక చిలుకను ఎగరకుండా పిడికిట్లో బంధించడంలాంటిదే నీ పొజెసివ్‌నెస్. నీ ధోరణితో ఆమె గిలగిల్లాడి బెంబేలెత్తిపోయి నాతో వాపోయేది.

పరిమళ ఆనాడు నిన్ను తిరస్కరించడానికి కారణం కూడా అదే. . . '

ఆనాటి నా ప్రవర్తనకు అభద్రతా భావమే కారణమని అప్పట్లో నాకు తెలిస్తేగా!

ఆమె తలలో నాకిష్టమైన గులాబీలు కాకుండా మల్లెపూలు పెట్టుకుంటే? ఛ. ఎంత అనాగరికమైన మాటలతో ఆమెను నొప్పించేవాడినో?

నా మనసు అగ్నిలో దహించుకుపోతోంది.

'నేనెంత మహా పాపం చేసాను?'

నేనేనా ఈ మాటంటున్నది???

రాజా కంఠం మంద్రంగా వినిపించింది.

' జగన్. . . తనకు దక్కని దానిని ఇతరులకు దక్కనివ్వకూడదనుకోవడం పాశవికం తప్ప ప్రేమ ఎప్పటికీ అవదు. అందుకే కాలం మారినా అమ్మాయిలమీద ఈనాడు కూడా ఇన్ని అమానుషాలు! దెబ్బతిన్న అహంభావంతో ఈలోకంపై ద్వేషంతో . . . దానిని రూపాయలుగా. . . సంపాదనగా మార్చుకుని వ్యాపార ప్రపంచంలో తిరుగులేని రారాజువయ్యావు. కాని పరిమళ. . . ? ? తనమీద నువ్వు ఆసిడ్ పోయడం. . . తెలిసీ కోర్టులో నోరు మెదపలేదు. అంతేకాదు. . . కురూపిగా మారిన తన ముఖాన్ని పదేపదే చూసుకుని ఏ ఆత్మహత్యో చేసుకుని పిరికిదానిలా జీవితంనుండి పారిపోలేదు ఆమె. ఓటమినుండే గెలుపుకు సోపానాలు నిర్మించుకుని ప్రేమతో ఆర్తజనుల హృదయ సింహాసనాలను అధిష్ఠించింది.

'ఏది కోల్పోయినా దానిని మనం ఎదగడానికి ఒక మార్గంగా మలుచుకోవడమే గొప్పతనం. '. . . అనే సత్యాన్ని నమ్మి అనాథ చిన్నారుల సంక్షేమాన్ని తన ధ్యేయంగా చేసుకుంది. '

'రాజా! అయితే నేను క్షమకు అర్హుడిని కానంటావా?'

నాకంఠంలో పశ్చాత్తాపం???

'ఆమె మాత్రం క్షమకు మారుపేరు జగన్! అందుకే ఈ వారణాసిలో గంగ ఒడ్డున దిక్కులేక స్పృహతప్పి పడివున్న నిన్ను ఈ ఆసుపత్రిలో చేర్పించడమేకాదు నీకోసమే ఇక్కడ వాలంటీర్‌గా చేరి ఇన్ని రోజులుగా దగ్గరుండి నీకు సేవ చేసింది కూడా పరిమళే. '

అంటే మాస్కు మాటున ఆ నర్సు. . . పరిమళా?

ఆ కళ్లలో ఎంతటి ప్రేమ. . . కరుణ???

నా గుండె బద్దలైపోతోంది.

నాభార్య అస్థినిమజ్జనం తర్వాత అసలే ఆస్త్మా పేషంటునయిన నేను స్పృహ కోల్పోతే... పరిమళ తుచ్ఛుడనైన నా ప్రాణం కాపాడేందుకు నా పాపాన్ని మరచి సేవలు కూడా చేసిందా?

'రాజా! నా క్షమాపత్రం వినేందుకు నాభార్య ఈలోకంలో లేదు. తనకిష్టంలేని పెళ్లి చేసానని కూతురు కోపంతో నా దరిదాపులకు రాదు. నేనేనాడూ పట్టించుకోని కొడుకు ఇప్పుడు నా చరిత్ర తెలిసాక పట్టించుకుంటాడనుకోను. నాకు మిగిలింది ఒకే ఒక్క అవకాశం . ఒక్కసారంటే ఒక్కసారి పరిమళను కలిసి క్షమాపణ కోరాలి. దయతో అనుమతించండి. ఒక్కసారి ఆమెను?'

నా కంఠంలో ఆర్తి నన్నే ఆశ్చర్యచకితుడిని చేస్తోంది.

స్వామీజీ గంభీరంగా అన్నారు. 'జగన్! పరిమళ చాలా అదృష్టవంతురాలు. నీ క్షమాపత్రమంతా విని అప్పటిలా గుండెల్లో బరువును కప్పిపుచ్చుకుంటూ నీ ఎదుట మళ్లీ చిరునవ్వు నవ్వాల్సిన శిక్షను భగవంతుడు ఆమెకు తప్పించాడు. ఆమె పదిరోజులక్రితమే కోవిడ్‌తో చనిపోయింది. '

ప్రేమరాహిత్యంతో పూర్తిగా అధ:పాతాళంలోకి జారిపోతున్న నాలో అకస్మాత్తుగా పెద్ద కుదుపు. .

గుండెలో ఎక్కడో కలుక్కుమంది.

కళ్లెత్తి రాజా... కాదు కాదు... స్వామీజీకేసి చూసేందుకు ప్రయత్నించాను.

కానీ నా కళ్లకు ఆయన రూపం మసకబారింది. ఆక్సిజను అందక ఎగిరి పడుతున్న నాగురించి చెప్పేందుకే కాబోలు స్వామీజీ వడివడిగా బయటికెళ్లిపోతున్నాడు.

నా చెవిలో స్వామీజీ మాట హోరు....

'కర్మ ఫలాలు ఈజన్మలోనే అనుభవానికి వస్తాయి. '

ఈలోకంలో నాకోసం మనస్ఫూర్తిగా ఒక్క అశ్రుకణమయినా రాల్చే ఒక్క ప్రాణిని అయినా మిగుల్చుకోలేకపోయాననే భయంకర వాస్తవం నమిలి మింగేస్తుంటే ... నా శరీరం అలా ఊపిరందక ఎగిరెగిరి పడుతూనే ఉండడం నాకు చివరి క్షణంవరకు తెలియడాన్ని మించిన భూలోక నరకం ఎక్కడైనా ఉంటుందా?

\+ + +

'ఈ పెద్దగేటుముందు కారాపు భాస్కర్!' చెప్పడం ఆపి మిత్రునికేసి చూసాడు నవీన్.

సడెన్ బ్రేక్‌తో భాస్కర్ నడుపుతున్న కారు కీచుమంది.

'ఆపుతానుగానీ అమాయకురాయిన ఒక ఆడ పిల్లకి జీవితమే లేకుండా చేసిన అతను అదే ... ఆ జగన్ నేరానికి అంత తొందరగా ప్రాణంపోవడమే తగినశిక్ష అని నీ అభిప్రాయమా? అసంతృప్తిగా అనిపిస్తోంది నవీన్!'

జగన్‌మీద ఆగ్రహంగా వుంది భాస్కర్‌కి.

'నిజమే. కోవిడ్‌తో మరణించివుంటే అది అతనికి చాలా చిన్న శిక్షే అయివుండేది. '

'అంటే జగన్ మరణించలేదా?'

'లేదు. కోవిడ్‌నుంచి బాగా కోలుకున్నాడు కూడా. '

'డామిట్!'

'నేను దిగాల్సింది ఇక్కడే... వస్తాను మరి.'

'ఎవరున్నారిక్కడ?'

గేటు ఆర్చి మీద 'మానసిక చికిత్సాకేంద్రం' అన్న పేరు చూసి అయోమయంగా అడిగాడు భాస్కర్.

'నా తండ్రి జగన్!!! నిత్యం తన పాపాన్ని గుర్తుచేస్తూ యాసిడ్‌తో కాలిపోయి చెదలుపట్టినట్టున్న వికృతమైన ఓముఖం వెంటాడుతూంటే ... ఎవరికి అందించాలో తెలియని క్షమాపత్రాన్ని మోసుకుంటూ ఇక్కడే తిరుగుతున్నారు. '

\+ + +

RAMANA
—COACHING CENTER—
YOUR SUCCESS IS OUR PASSION
woodbridge.nj@ramanacoachingcenter.com 732-268-5445

## మట్టిపాదాలు

**చొక్కర తాతారావు**

నడచి నడచి పాదాలు రహదారులు చేసి
తూరుపు తొలివెలుగు రాకముందే వేగుచుక్కలై
గమ్యం కనపడని దారుల్లో
అనంత లోకాల వైపు
వాళ్ళు నడుస్తూనే ఉన్నారు
చీలిన పాదాల రక్తపు ఏరుల మధ్య
బతుకు ఆకాశాన్ని నెత్తి మీద మోస్తూ
ఎర్రని ఎడారుల వెంట వాళ్ళు నడుస్తూనే ఉన్నారు
కందిపోయిన భుజాల మీద బిడ్డల్ని మోస్తూ
తూలుతున్న దేహాల్ని మండే ఎండలో
నిటారుగా నిలబెట్టి కఠోర సైనికుల్లా
కలల తీరాల వైపు అడుగులు సారిస్తున్నారు
బొబ్బలెక్కిన పాదాల అడుగున
పుళ్ళు కార్చే రసిని తుడుచుకొని
ఆరిపోతున్న ఊపిరికి కొత్తరక్తం ఎక్కించి
అడుగులో అడుగేసుకుంటూ
కనుచూపు మేర నడుస్తూనే ఉన్నారు
ఆకలి వేసేచోట దాతలు అందించేది
శూన్య దేహంలో నింపుకొని
అంకెల మైలురాళ్ళు దాటుతున్న మట్టి పాదాలు
ఎండైనా వానైనా చీకట్లు కమ్ముకున్నా
కళ్ళల్లో వెలుతురు చుక్కలు పొడుచుకుని
అవిశ్రాంతంగా వాళ్ళు నడుస్తూనే ఉన్నారు
నడచి నడచి సొమ్మసిల్లి లేచి నిద్రకళ్ళను తట్టిలేపి
ముందుకు మునుముందుకు ఆశలతీరం ఆవలి వైపుకు
వాళ్ళు నడుస్తూనే ఉన్నారు
ఆకాశహర్మ్యాలు తాకిన చేతులు డీలాపడి
మూలన పడిన వస్తువుల్లా నిరాశతో వేలాడిపోయాయి
కళ్ళల్లో ముసలితండ్రి కలల్లో నడయాడిన ఊరు
ఎదురుగా ఎండమావిలా గోచరిస్తోంది
బతుకైనా చావైనా ఊరేనంటూ
గుండె చివర ఊపిరి దాచుకుని
ఊరి పొలిమేరలో నిశ్శబ్ద పాదధ్వని
ఊరేకద మనిషికి ఊపిరి తీరం
సొంత ఊరే మనిషి చివరి ప్రయాణం

# బామ్మగారూ సెల్ ఫోనూ

**భాగవతుల భారతి**

మానవీయ కోణాన్ని ప్రసార మాధ్యమం ఎప్పటికప్పుడు ప్రభావితం చేస్తూనే ఉంది. చాపక్రింద నీరులా ~

నేనుఆలోచిస్తున్నాను. ఏంజరుగుతోంది మనచుట్టూ, కాలంతోపాటు మనం మారామా? మన మూలంగా కాలం మారుతోందా? మూడు తరాల అంతరంగాలనూ అంచనావేస్తూ ఆలోచిస్తున్నాను. ఇదివరకు ఈ ఇల్లు ఎలాఉందీ? ఇప్పుడెలా ఉందీ? ప్చ్!

//////

" సౌదా! అయిందా? "మామగారి పిలుపుకు
"వచ్చేస్తున్నా మామయ్యా " జవాబు చెప్పి ~
"స్వస్తిశ్రద్ధాం మేధాం యశ: " ~ ~

అగ్నిహోత్రపు ఆఖరిమంత్రం కూడా చదివేసి తర్వాతి మంత్రాలు నోట్లో చదివేస్తూ, చకాచకా అన్నీ సర్దేసి, పరుగులాంటి నడకతో, ఇంట్లోకి వచ్చేదాన్ని, మామయ్యగారికి కాఫీ ఇవ్వడానికి.

" ఏమిటే చాదస్తం, తెల్లవారేటప్పటికి, వంటలూ, టిఫిన్లు, బాక్సులు, పిల్లల్ని స్కూల్ కి రెడీ చేయటాలూ, ఇన్నీ చాలవనీ ఈ అగ్నిహోత్రం ఒకటీ, పనులు ఎక్కడ తెములుతాయీ, ఇవన్నీకాక మళ్ళీ స్కూల్. ఏదీ ఆపవుకదా? కానీయండీ టైం అవుతోందీ "

నాకు చేదోడువాదోడుగా ఉంటూనే ముద్దుగా విసుక్కుంటోంది అత్తయ్య. గబగబా తెమిలి, స్కూల్ కి పిల్లలతో వెళ్ళిపోయేదాన్ని. మావారు రమణశర్మ కూడా,నా, ఆత్తయ్య సాయంతో రెడీ అయి కాలేజీకి వెళ్ళిపోయారు. ఇంట్లో అత్తయ్యా మామయ్యా ప్రశాంతం.

సాయంత్రం అవగానే,మళ్ళీ హడావిడి గా ఇల్లు చేరేదాన్ని పిల్లలతో. అప్పటికే బయటిపిల్లలు ఇంటి కొచ్చి ఎదురు చూస్తుండేవారు. వాళ్ళు తరగతి గదిలో పాఠాలకు ప్రైవేట్ ట్యూషన్ కి వచ్చిన వాళ్ళుకారు.

ప్రాచీన సంస్కృత, తెలుగు భాషాభిమానంతో, ఎలాగైనా తమ పిల్లలకు ఓ సంస్కృతీ, సాంప్రదాయం నేర్పాలి. ఈరోజుల్లో అవన్నీ, భాషా రూపంగాగానీ, సాంప్రదాయ రూపంగా గానీ మృగ్యమై పోతున్నాయ్, వాటిని చేతులడ్డి ఐనా కాపాడాలనుకునే, కొంత మంది సత్సాంప్రదాయ వాదులైన తల్లిదండ్రులకు ప్రతీకలు వాళ్ళు. సాంప్రదాయాన్ని, శ్లోకం, పద్యం, రూపంలో వల్లెవేసేసి, మళ్ళీ యధాతధంగా తరగతి పుస్తకాలతో కుస్తీ పట్టడానికి, గంటలో ఎవరిదారిన వారు వెళ్ళి పోయేవారు.

నేను, పి, జి డిగ్రీ తోపాటుగా వేదమంత్రాలు కూడా కొన్ని నేర్చుకున్నాను. కాబట్టి పిల్లల తల్లిదండ్రులు, నాదగ్గరకు తర్ఫీదు కోసం పంపిస్తారు. ప్రతిఫలాపేక్షగానీ ధనాభిలాష గానీ, ఆశించని ఓ ఆదర్శవంత మైన, ఉదాత్తమైన ప్రక్రియ,

"అవునూ! మా కోడలు హోమం చేస్తుంది. కాస్తో కూస్తో వేదమంత్రాలు చదువుతుంది. మేం బాగానేఉన్నామ్, మీకేమిటి ఇబ్బంది? ఆడవాళ్లు ఇవన్నీ చేయకూడదనే మూఢ నమ్మకం మాకులేదు" అని సున్నితంగా నాకు సపోర్టు ఇస్తూ చాలా ప్రోత్సాహం అందిస్తూవచ్చారు, అత్తయ్య కూడా నాకు మద్దతే. ఆయనైతే సరేసరి. ఇంట్లో గాని వేరే ఇతర విషయాలలోగానీ నాకు మంచి సహాయకుడే, యజ్ఞసామాగ్రి కూడా శ్రద్ధగా తీసుకురావటం లోకూడా ~

~ ~ ~ ~ ~ ~ ~ ~ ~ ~ ~ ~ ~ ~

కాలచక్రం గిఱ్ఱున తిరిగింది. మామయ్య గారు మరణించారు, సహజంగా ఇంట్లోనూ చాలామార్పులు జరిగాయ్. కాలేజీలో తరగతి గదులను డిజిటల్ క్లాస్ లు ఆక్రమిస్తున్న నేపద్యంలో ఆయనగారు వృత్తిరీత్యా ఓ స్మార్ట్ ఫోన్ కొన్నారు. ఒకటి కొంటే ఒకటి ఉచితం. నాకూ ఒకటి ఇచ్చారు.

ఇక అంతే, నా దైనందిని మారిపోయింది. సెల్ కొత్త మోజులో నేను ప్రపంచాన్నే మరిచిపోయాను. ఇంట్లో అందరి అవసరాలూ తీరంగానే సెల్ ముందేసుకుని కూర్చుని, క్రమక్రమంగా సాహిత్యప్రక్రియలు నేర్చుకుని, పండితులతో ఇష్టాగోష్ఠులు, సాహిత్యానికి సంబంధించిన అన్ని ప్రక్రియలూ, నేర్చుకుని నేనుచదువుకున్న చదువుకు సార్థకత చేసుకుంటున్నాను. కానీ, అత్తయ్యగారు సుశీలమ్మగారికి మానసికంగా దూరమయ్యాను. ఇదివరకు ఏపనైనా కలిసి సంప్రదించుకుని చేసేవాళ్ళం. అత్తయ్యగారుచుట్టుప్రక్కల విషయాలన్నీ పోగేసుకొచ్చి,"ఏమే! సౌదా! మరే!" అంటూ నాకు పూసగుచ్చినట్టు చెప్పి ఆనందపడేవారు. ఆ జరిగిన సంఘటనల మీద గంటలు గంటలు చర్చించుకుని చివరికి "ఆ ~ మనకెందుకు లెద్దూ " అనుకుంటూ, చుట్టుప్రక్కల ఆదర్శఅత్తాకోడళ్ళు, అని అందరిచేతా శభాష్అనిపించుకున్నాం.

సెల్ నాకు మంచే చేసినా మా ఇంట్లోవాళ్ళ మనసుల్లో అగాధాలు సృష్టించింది. మా ఇంట్లోజరిగినమంచికీ చెడుకీ కూడా టెక్నాలజీ వారధిఐంది.

" ఏమే! అమ్మాయ్ లేచి అగ్నిహోత్రం చేయవా? "అత్తయ్యగారు పిలిస్తేగానీ ఈలోకంలోకి రాలేకపోతున్నాను.

ఇంటికి పద్యం, మంత్రం నేర్చుకునే పిల్లలను దగ్గరకు రానీయట్లేదు. "టీచర్, టీచర్, మాకెదన్నా నేర్పండి "అని ఫోన్ చేసిన పిల్లలకూ, "మేడమ్! మా పిల్లలకు సంస్కృతి, సాంప్రదాయం మీరు కాకపోతే ఎవరు నేర్పుతారూ?" అనిపెద్దలు అడుగుతుంటే నిర్లక్ష్యం చేసేసి సెల్ ప్రపంచం లో మునిగిపోయా.

ఇలా చాలా మార్పులు జరుగుతున్నాయ్. చక్కని ఫ్రెండ్ లా ఉండే నేను తనతో తక్కువ గా మాట్లాడటం జీర్ణించుకోలేక పోతోంది, అత్తయ్యగారు. "ఏరా! నేనెక్కడికైనా వెళ్ళిపోతా! నన్ను ఇంట్లోంచి పంపేయ్, ఇంట్లో చిరాకుగా ఉంది ఉండలేక పోతున్నాను" అన్న అత్తయ్య గారి ఆరోపణ మావారిని ఆలోచనలో పడేసింది. "ఏంటమ్మా! ఈ వయసులో ఈ మాటలూ నీకేం తక్కువయిందనీ, సౌదామినితో గొడవలేం లేవుగదా! నిన్ను తల్లి కంటే ఎక్కువగా చూస్తోంది కదా?" అని అడిగిన అత్తయ్యగారి తల్లి మాటకు మనసులో నాతోపాటు ఆయనా

నొచ్చుకుంటూ,

"అయ్యో! అదేం కాదురా.. అది చాలా మంచిది. నాకు సమయానికి అన్నీచక్కగా అమరుస్తుంది,బంగారు కోడలురా! కానీ ఈ సెల్ ఫోన్ వచ్చాక అది చాలా మారిపోయిందిరా! నాతో గడిపే సమయాన్ని సెల్ ఫోన్ కి ఇచ్చేసింది. రోజూ పనికాగానే అందులోనే తలదూరుస్తుంది, ఇదిగో నేను ఒంటరిగా కూర్చుని టి, వి లో వచ్చే సీరియల్స్ చూసీ, చూసీ విరక్తి పుడుతోంది, పిల్లలు స్కూల్ కి వెళ్ళి పోతారు, వాళ్ళ చదువుతో వాళ్ళుకూడా బిజీ. అంతలా చూసేంతగా ఏముంటాయిరా ఆ సెల్ లో" తన మనసులోని మాటను కొడుకు ముందు బయట పెట్టేసింది. తల్లి ఒంటరితనంతో బాధ పడుతోందని ఆయనకు అర్థమయ్యింది.

//////////////

"అమ్మా! నీకో సర్ప్రైజ్ "అంటూ ఆనందంగా వచ్చి తల్లిచేతిలో ఒక పాకెట్ ఉంచారు ఆయన. నేనేం ఈర్ష్య పడలేదు.

"ఏమిటిరాఇదీ! అర్థంకాలా! ఏదో పెట్టెలా ఉందే "అన్నారు,పెట్టెను తడిమి చూస్తూ. పాకెట్ విప్పారు. టచ్ మొబైల్ నల్లగా మెరుస్తూ కనబడేసరికి "ఇంత పెద్దఫోన్ నాకెందుకురా? ఖరీదు కూడా ఎక్కువే అనుకుంటా. ఇప్పటికిప్పుడు పదివేలు పోసి ఎందుకు కొన్నావు? ఇందులో నాకేం అర్థం అవుతుందీ? దీనిని ఎలా నొక్కాలో నాకేం తెలుసూ" అంటూ ఆనందంగానూ, కాస్త మొహమాటం తోనూ ఉబ్బితబ్బిబ్బయ్యింది 80 ఏళ్ళ అత్తయ్యగారు. "నేర్చుకుంటే ఏదైనా వస్తుందమ్మా! మాన్వి ఉందిగా, ఆదివారం రోజు దానిదగ్గర నేర్చుకో! అన్నాడు, ఏడవ తరగతి చదువుతున్న మాన్వి సెల్ టెక్నాలజీ అంతా అవపోసన పెట్టేసింది. దానికి బామ్మంటే ప్రాణం. స్కూల్ నుండి రాగానే బామ్మే కనబడాలి, బామ్మ ప్రక్కన లేకుండా నిద్రపోదు. స్కూల్ విషయాలన్నీ బామ్మకే చెపుతుంది. బామ్మా, మనవరాలు మంచి స్నేహితులు. ఇంకేం ఒకఆదివారం నాడు గదిలో మంచంమీద, గుసగుసలాడుకుంటూ పక్కపక్కనే పడుకుని సెల్తో కుస్తీ మొదలెట్టారు ఇద్దరూ,

"ఏమిటే! ముట్టుకోగానే పాదరసంలా జరిగిపోతోందీ? " సంబరపడిపోతోంది అత్తయ్య.
"ఇది అంతే బామ్మా! ఇదిగో ఇలా నొక్కాలి! ఇలా చేయాలి! "అంటూట్రైనింగ్ ఇచ్చింది,

మాన్వి స్కూల్ కి పోగానే బామ్మగారు సెల్ ఆన్ చేసి సినిమాలు చూడటం, జోక్స్ ఎంజాయ్ చేయడం, తెలియనివి ఆయనను నన్ను అడిగి తెలుసుకోటం, అత్తయ్య పాత తరం అత్తయ్య గా, బామ్మగాగాక, క్రొత్తతరం అత్తయ్యగా బామ్మగా సరికొత్త అవతారం ఎత్తి పరిణతి సాధించారు.

అంతవరకూ ఆవిడ కాలక్షేపం బాగానేఉంది, కానీ మాన్వి బామ్మకి ఫోన్ వాడకం నేర్పే క్రమంలో ఫోనుకి అలవాటు పడింది. స్కూల్ నుండి రాగానే చదువు, హోంవర్క్, మానేసి సెల్ ఆన్ చేయటం మొదలుపెట్టింది. పోనీలే సరదాగా కాసేపు ఆడుకోమని ఉపేక్షించాం అత్తయ్యగారూ, మేమూ. రోజూ ప్రేమగా వుండే బామ్మతోనే మాటలు మానేసి వీడియోగేమ్స్ టిక్ టాక్ లు, యు ట్యూబ్ ఆన్ చేసి ఏమిటేమిటో చూడటం,మొదలు పెట్టింది. అత్తయ్య ఎవరికన్నా ఫోన్ చేయాలన్నా ఫోన్ మనవరాలిని అడుక్కోవటం చూసే వాళ్ళకి ఇదేమిటీ అనిపిస్తోంది. అవసరానికి వాడాల్సిన ఫోన్ బామ్మచేతిలో కన్నా, మనవరాలి చేతిలోనే ఎక్కువసేపు ఉంటోంది. ఇంట్లో వాళ్ళు మందలించారు. తెలిసినవాళ్ళచేత చెప్పించాం. సెల్ పిల్లలు వాడటం వల్ల వచ్చే నష్టాలు పేపర్లో చదివివినిపించాం. ఐనా వినే స్థితి దాటింది, నిరంతరం సెల్, సెల్. బయట ఫ్రెండ్స్ ని కలవడం మానేసింది, అందరికీ తన నెంబర్ ఇచ్చి గంటలకొద్దీ వాట్సప్ ఛాటింగ్ లు, గంటలు గంటలు మాటలు ముచ్చట్లు, ఏదన్నా అంటే సిలబస్ డౌట్స్ అని చెప్పటం తలనొప్పిగా తయారయింది. అన్నం తినేటప్పుడు కూడా సెల్ చూస్తూ తినడమే, అర్ధరాత్రిదాకా మేలుకొని ఫోన్లో మునిగిపోవటం. ఇంట్లో వాళ్ళకి భయంపట్టుకుంది, ఈ వయసుకే టెక్నాలజీని ఇంత దుర్వినియోగం చేస్తే, పిల్లభవిష్యత్తు ఏమై పోతుంది? బామ్మకాలక్షేపం ఎలా ఉన్నా ఇది తలలు పట్టుకుకూర్చునేంత భారమైంది. ఏం చేయాలి?

ఓరోజు మాన్వి స్కూల్ నుండి రాగానే బామ్మా! అని పిలిచింది. బామ్మకనిపించలా!

"అమ్మా! బామ్మేదీ!" అడిగింది. మాన్వి

"నీకు సెల్ అప్పగించి తను ఎటోవెళ్ళిపోయింది, బహుశా వృద్ధాశ్రమానికనుకుంటా! నాన్నగారే దింపివచ్చారు. తనవల్లే అంటే తనకాలక్షేపం కోసం సెల్ఫోన్ కొనటం వల్లే నువ్వు చెడి పోతున్నావని ఏడుస్తూ మీ నాన్నతో నేనెటన్నా వెళ్ళిపోతారా పంపేయరా! అనటం విన్నాను. అయినా నీకెందుకు ఈ మధ్య బామ్మతో సహవాసం చేయట్లే దుగా నువ్వూ, పోతేపోనీ బామ్మనీ అంటూ ఇదిగో సెల్ నువ్వే ఉంచుకో!" సెల్ ఫోన్ మాన్వి చేతికి ఇస్తూ అన్నాను. అంతే,ఏడుపు మొదలు పెట్టింది మాన్వి, "బామ్మకావాలీ "అని ఏడుపు, ఎవరూ పట్టించుకోనట్లు ప్రవర్తించాం, మౌనంగా మేమంతా ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నం అయ్యారు, కానీ మాన్వీ మాత్రం పుస్తకాలు ముట్టలేదు, ఏడుస్తూనే ఉంది, అన్నం తినలేదు, మరునాడు స్కూల్ కి వెళ్ళలేదు. బామ్మకావాలీ ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ సెల్ విసిరేసింది. " అమ్మా! నాకు ఫోన్ వద్దమ్మా! బామ్మే కావాలి! పిలువమ్మా!" కానీ మేం ఎవరం స్పందించలేదు, జ్వరం వచ్చింది, సంధి కలవరింతలు "బామ్మా!బామ్మా!" అని.డాక్టర్ వచ్చి ట్రీట్మెంట్ ఇచ్చారు, తగ్గలా! వారం రోజులకి ఎక్కడినుండో ఊడిపడింది, అత్తయ్య. మాన్వీ, మాన్వీ అని పరుగుపరుగున. "బామ్మా నాకు నీ సెల్ ఫోన్ వద్దు, నువ్వే కావాలి ఫోన్ నీకిచ్చేస్తా, నన్ను వదలిపెట్టి వెళ్ళిపోకూ" "కలవరిస్తోంది మాన్వి. బామ్మ,మనవరాలు కౌగిలింతలతో మమేకమైపోయారు."నిన్ను విడిచి నేనెక్కడికి పోతాన్రా బంగారం మనిద్దరం ఎప్పటికి స్నేహితులం సరేనా!" మనుమరాలి దగ్గరే కూర్చుని బుజ్జగించింది. వారిద్దరి బాంధవ్యాల మధ్య అనుబంధాల తీవెలు అల్లుకున్నాయి. నేనూ ఈయనా నవ్వుతూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నాం. కానీ నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నా వల్ల కాదూ!? ఇన్ని అనుబంధాలకూ, అవాంతరాలూ, నన్ను నేను మార్చుకోవాల్సింది చాలా ఉంది. వెంటనే ఫోన్ చేతుల్లోకి తీసుకున్నాను. కొంతమంది పిల్లలనూ, వారి తల్లిదండ్రులను మన సంస్కృతికి పునరంకితమవుదాం రమ్మని పిలవాలని.

~ శుభం ~

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey**

# శ్రీ శుభకృతు నామ సంవత్సర
# ఉగాది వేడుకలు

**May 7th 2022 (Saturday)**
**3:30 to 8:30 PM**

**TAGORE HALL**
**269 Cedar Grove Lane, Somerset**

## గానలహరి



పంచాంగ శ్రవణం



స్థానిక కళాకారుల సంగీత నృత్యాలు



ML Gayatri
Singer



Venu Srirangam
Singer



విందు భోజనం



Mimicry
Avinash
Comedian



Roll Rida
Rapper

**For additional information:**

| | |
|---|---|
| Sreedevi Jagarlamudi | 732-470-7055 |
| Bindu Yalamanchili | 908-240-3167 |
| Anuradha Para | 201-312-5335 |
| Srinivas Cheruvu | 732-447-6686 |
| Jyothi Gandi | 732-208-9599 |
| Anuradha Dasari | 908-907-1502 |
| Ravi Annadanam | 917-355-5503 |

**Sponsors**

RAMANA COACHING CENTER

icon

https://www.icontechnicalgroup.com/

NEW YORK LIFE

Thevan Thevakumar

Balaji Flowers Usa

www.GRUHAPRAVESH.com presents INDIA PROPERTY EXPO

**Media Support :**

mana tv HD · TV5 NEWS · TV ASIA TELUGU · TELUGU NRI RADIO · TV9 · GNN · SAKSHI TV · US 1 TELEVISION · SUNRISE TV

# ఉగాది 2022 సంబరాలు











# ఉగాది ౨౦౨౨ సంబరాలు











# ఉగాది ౨౦౨౨ సంబరాలు













# ఉగాది 2022 సంబరాలు










# మంచం

### దొండపాటి నాగజ్యోతి శేఖర్

రెప్పలు తెరిచిన  నా రంగుల కలల్ని ఆరేసుకునేది అక్కడే!
రెక్కలు విరిగిన నా ఆశల్ని కన్నీటి దహనం చేసేదీ అక్కడే!

నా గుండె గుబులును తమలోకి నింపుకొని
స్థైర్యంగా నిలబడమని చెప్పేది....
నా సంతోషాల దొంతరల్ని మోసేది
ఆ నాలుగుకోళ్లే!

తన ఎదపై అడ్డంగా వాలుతానా....
అమ్మ ఒడిలా ఓదార్చేందుకు సిద్ధంగా ఉంటుంది!
నే గుప్పెడు నవ్వుల్ని పోగేసుకొస్తానా....
తను పులకరింతల పువ్వై
స్వాగతిస్తుంది!

నా బతుకు బద్దెలకు చుట్టుకొన్న బంధాల స్పర్శ తనకు తెలుసు!
నా జీవన పేగును ఆకుపచ్చగా నిమురుతూ..
నాకు పురుడోసిన విశ్రాంతి వనం తను!

పొద్దుపోని వెతల రాత్రుల్ని
తనపై విదిలించినప్పుడల్లా
నా దుఃఖ భారాన్ని తనలోకి ఇంకించుకుంటుంది!
చిట్లుతున్న మస్తిష్క కణాల ను జోకొడుతూ సాంత్వనతలగడపై
సేదదీరుస్తుంది!

పొంగిన హృదయ కాంతుల్ని కవితగా రాసేందుకు
తన ఎదపై ఒరిగిన తెల్లకాగితాన్ని ముద్దాడుతూ  నా భావాల ముద్రల్ని
తొలిగా స్పృశించేది తనే!

నా బతుకు పొద్దులో
అమ్మఒడి కిరణస్పర్శ తర్వాత....
పసిప్రాయపు వెలుగుల్ని పంచుకొన్న తొలిస్నేహ స్పృహ తనే!

గత కాలపు నింగిలో కరిగిన
నిన్నల సంధ్యలకు వీడ్కోలు చెబుతూ...
మృత్యు చీకటిని చేరుకున్నపుడు తనపై చేర్చుకొని
నా వెంట వచ్చే "పాడెమంచం"
నా చివరాఖరి నేస్తం!

పురిటి  నుండి పాడె వరకూ
నన్ను మోస్తూ
నా జీవిత రేయిపవళ్లకు  ప్రత్యక్ష సాక్ష్యమైన "మంచాన్ని" ఇలా
వాల్చిన ప్రతిక్షణం నేను అమిత విశ్రాంతిని పొందుతాను!
నా పక్కనే కాస్త ఖాళీ అట్టేపెట్టి అలసిన హృదయాలను
ఆహ్వానిస్తాను!

Est. 1977
www.tana.org

# చెలిసగం

గొర్తి వాణిశ్రీనివాస్

లక్ష్మి, రంగడు రోజువారీ పనులు చేసుకునే కూలీలు.
ఇద్దరూ పొద్దున పనికి వెళ్లి రాత్రికి వస్తారు.
వాళ్లకు ఇద్దరు పిల్లలు.

ఇద్దరూ అపార్ట్మెంట్స్ కట్టే తాపీ మేస్త్రీ దగ్గర కూలిపనికి వెళుతుంటారు.

టైల్స్ కొట్టడం రద్దుని గోనిసంచుల్లోకి ఎత్తడం రంగడిపని. ఆ సంచుల్ని తలమీద పెట్టుకుని బయట పారబోయడం లక్ష్మి వంతు. వర్కర్స్ ని లిఫ్ట్ వాడనీయరు అపార్ట్మెంట్ వాళ్ళు. ఎన్ని అంతస్తులైనా మెట్లమీదనుంచే ఎక్కి దిగాలి.

ఓరోజు టైల్స్ కొడుతుంటే రంగడి చెయ్యి కోసుకుపోయింది. పని ఆపి కూర్చున్నాడు. సాయంత్రానికల్లా బాత్ రూమ్ టైల్స్ ఊడదీయాలని చెప్పాడు మేస్త్రీ.
కొన్ని టైల్స్ అయినా పగలకుండా తీస్తే బాల్కనీ గ్రిల్స్ పై పరుచుకుంటామని చెప్పింది

ఆ ఇంటి పెద్దావిడ.

రంగడి చేతి గాయానికి కట్టుగట్టి "నువ్వు తప్పుకో మావా! నేను చేస్తానుండు" అంది లక్ష్మి.
"నా వల్లే కాదు. నువ్వెలా చేయగలవు " అన్నాడు
కొన్ని టైల్స్ పగలకుండా ఊడతీసింది లక్ష్మి..

ఇన్నాళ్లుగా ఈ పని చేస్తున్నా ఒక్క టైల్ కూడా పగలకుండా రాలేదు. నువ్వెలా తీసావే
అన్నాడు రంగడు.

"ఏంలేదు మావా! ఇంటికాడ కొబ్బరి చిప్పని చాకుతో కోసి ముక్కలు తీస్తాం కదా. ఆ ఉపాయం ఇక్కడ ప్రయోగించా. ఎక్కడ బెసగ కొడితే ఎక్కడ ఏ రాయి లేస్తుందో తెలిసిపోయింది ఇదే కొబ్బరి చిప్ప సిద్ధాంతం మావా " అంటూ నవ్వింది లక్ష్మి.

భార్య తెలివికి మురిసిపోయాడు రంగడు.
లక్ష్మి ఉపాయంతో చేసే పనులను అందరూ మెచ్చుకున్నారు. నీకంటే నీ భార్య తెలివైంది అనడంతో రంగడిలో ఆత్మన్యూనత మొదలై లక్ష్మి మీద ఆధిక్యత చూపాలని ప్రయత్నించేవాడు.

ఆమెను పూచికపుల్లలా తీసిపారేయడం, నలుగురిలో కించపరచడం , నా తెలివిముందు నీ తెలివెంత అని ఎద్దేవా చేస్తూ మాట్లాడడం చేయసాగాడు.

లక్ష్మి ఇవేమీ పట్టించుకోకుండా తన పని తను చేసుకుపోతోంది.

"నా రోజు కూలీ వెయ్యి రూపాయలు, నీ కూలీ ఏడొందలు.
మనిద్దరికీ తేడా లేదంటే ఎల్చిమీ!? నువ్వు నా మాటే ఇనాల.
నేను వయసులో పెద్దోడ్ని, నీకన్నా ఎత్తులో బలంలో రోజు కూలీ డబ్బుల్లో కూడా పెద్దోడ్నే."అన్నాడు రంగడు.

"నీకు వెయ్యిచ్చి నాకు ఏడొందలే ఇస్తుంటే మేస్త్రీని నిలదీసి అడగవెందుకు? నా ఇంటిది కూడా నాతో సమానంగా కూలిపని చేస్తోందని గట్టిగా నిలదీయొచ్చుగా " అని అడిగింది లక్ష్మి

"ఎందుకడగాల మనిద్దరికీ సమానంగా కూలి ఇచ్చేస్తే మనిద్దరి బలాలూ సమానమైపోతాయా? ఆడది ఆడదే మగాడు మగాడే " అన్నాడు రంగడు.

అతనితో వాదన పెట్టుకోడం దండగ అని ఇంటిపనులు ముగించి వంట చేసి పిల్లలకు అన్నం తినిపించి రంగడికీ తనకీ క్యారెజీ కట్టింది. ఇద్దరూ కలిసి పనిలోకి వెళ్లిపోయారు.

వీళ్ళ సంభాషణను వింటున్న పక్కింటి లెక్కల మాస్టారు మాధవరావు చిన్నగా నవ్వుకున్నాడు.

ఒకరోజు రంగడితో ఇలా అన్నాడు.
"రంగా! నీ భార్యకూడా నీతో సమానంగా పనిచేస్తున్నప్పుడు కూలీలో ఎక్కువ తక్కువల్ని నువ్వు ఎలా ఒప్పుకుంటున్నావ్. నీ భార్య నీకన్నా తక్కువ అని ఎలా అనుకుంటున్నావు?" అని అడిగాడు మాధవరావు.

"ఇద్దరం సమానం ఎట్టా అవుతాం సామీ! దానికి తక్కువ నాకు ఎక్కువ కూలీ ఇయ్యాల. అది నా మాట ఇనాల. అదీ రూలు" అన్నాడు రంగడు.

మాధవరావు బాగా ఆలోచించి లక్ష్మిని పిలిచి
"మీఆయనకంటే నువ్వే ఎక్కువ సంపాదిస్తున్నావ్ తెలుసా?" అన్నాడు

"అదెట్టా సామీ?! నాకు మా ఆయనికిచ్చినంత కూలి ఎప్పుడూ ఇవ్వరుగందా?" అంది లక్ష్మి.

"నువ్వు నేను చెప్పినట్టు చెయ్యి. ఎట్టాగో నీకే తెలుస్తుంది. సరిగ్గా వారం రోజులపాటు నేను చెప్పినట్టే చెయ్యి. మనసు కరిగి నా మాట తప్పావో నీ కథ మళ్లీ మొదటికి వస్తుంది. నీ అన్నలాంటివాడిని.

నా మాటమీద నమ్మకం ఉంచు." అన్నాడు మాధవరావు.

అతను చెప్పినట్టే ఆ రోజు పొద్దున ఒంట్లో బాలేదని మంచం దిగలేదు లక్ష్మి.
"జ్వరంగా ఉంది ఈయాలకు పనికి రాలేను. ఇంటిపనులు కూడా చేయలేను మావా. ఒంట్లో మా చెడ్డ నీరసంగా ఉంది." అని దుప్పటి ముసుగుపెట్టుకుని పడుకుంది లక్ష్మి.

పిల్లలకి బడికి ఆలస్యమైపోతోందని బయటనుంచి టిఫిన్స్ తెచ్చి పెట్టాడు రంగడు.
ఆ రోజు మధ్యాహ్నం, రాత్రి భోజనాలు కూడా బయటనుంచి తెప్పించాడు. ఇంటిల్లిపాతికీ తిండి ఖర్చు అంతా కలిపి ఆరోజుకి అయిదు వందలు అయింది.

మర్నాడు కూడా లక్ష్మి మంచం దిగలేదు.
ఆరోజు కూడా మరో అయిదు వందలు ఖర్చు.
ఇక బట్టలు ఉతకడం, గిన్నెలు తోమడం రంగడి వంతయ్యింది.
ఇంటిపనులు పూర్తిచేసి పనికి ఆలస్యంగా వెళ్లేసరికి అయిదు వందలు కోతపెట్టాడు మేస్త్రీ. హడలిపోయాడు రంగడు.

"లెగవే లక్ష్మీ! నువ్వు పడకేసిన ఈ రెండు దినాల్లో నీ కూలీతో కలిపి మనకి రెండువేల పైనే లాసు. ఇంకో నాలుగురోజులు నువ్వు మంచం దిగలేదంటే మనం అప్పుల్లో మునిగిపోతాం" అన్నాడు.

"అయ్యో మావా! అంత లాసైపోనామా!? ఒక్కరోజు తొంగుంటేనే రెండు వేలు నష్టం.
అదే వారం రోజులైతే మునిగిపోతాం. ఇద్దరం కష్టపడిన సంపాదనంతా గోవిందా.

ఇంట్లోపనంతా చేసుకుని నీతో పాటు పనికి వచ్చినందుకు ఏడొందలు, ఇంటి పనులు, వంట చేయడంవల్ల మిగిల్చింది అయిదొండలు కలిపి నా సంపాదన రోజుకి పన్నెండొందలు. నీకంటే రెండొందలు ఎక్కువే కదా మావా " అంది లక్ష్మి.

"అవునే లక్ష్మీ! నా కంటే నీ కూలి తక్కువని చాలాసార్లు నిన్ను వేళాకోళం చేసానుగానీ నువ్వు ఇంట్లో చేసేపనికి లెక్క కడితే నా సంపాదన ఏ మూలకే?! మనిఇద్దరం సమానమేనే.

మన కూలి కూడా సమానంగా ఇయ్యాల. ఈ మధ్యనే మన వాళ్ళు రోజుకూలీ సంఘం పెట్టారుగదా! అందులో ఈ సంగతి మాట్లాడ్దాం. ఆడాళ్ళకి కూడా కూలీ సమానంగా ఇవ్వాలని ఒక తీర్మానం తీసుకొద్దాం." అన్నాడు రంగడు.
రంగడి మాటలకు లక్ష్మి సంతోష పడింది.
మంచి ఉపాయం చెప్పిన లెక్కల మాస్టారికి కృతజ్ఞతలు చెప్పింది.

-----------------------------------------

NORTH AMERICAN TELUGU ASSOCIATION
NATA
ENTERNET
Business Systems, Inc

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

## New Jersey

# VIRTUAL Trimurthy Day CELEBRATIONS



## On March 27, 2022 (Sunday) from 9:30 AM EST

**Group Singing Sri Trinity Compositions**

**Vatapi Ganapatim in Hamsadhwani, Sadhinchene in Arabhi and Kamakshi Swarajathi in Bhairavi**

**For additional details contact:**

Prabha Raghunathan 908-234-2546 • Simanthini Kouta 908-234-1360

| | | | | | |
|---|---|---|---|---|---|
| Sreedevi Jagarlamudi | 732-470-7055 | Bindu Yalamanchili | 908-240-3167 | Jyothi Gandi | 732-208-9599 |
| | | Anuradha Para | 201-312-5335 | Anuradha Dasari | 908-907-1502 |
| | | Srinivas Cheruvu | 732-447-6686 | Ravi Annadanam | 917-355-5503 |


**Supporters / Sponsors**

NEW YORK LIFE Cultivating your career as an insurance and financial professional.

MEET EXECUTIVE PARTNER




Thevan Theivakumar
Call: (732) 744-3763


The event is jointly sponsored by the Polepalle Foundation and the HELP Foundation.org

HELP FOUNDATION
HEALTH AND EDUCATION FOR LESS PRIVILEGED

# ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు









# ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు



## ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు



## ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు









# ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు



# ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు



# ౨౦౨౨ త్రిమూర్తి దినోత్సవాలు



# ఇదేమి న్యాయం... ?

పిడపర్తి భారతి

తాళం తీస్తున్న చప్పుడు విని, “నళినీ వస్తోంది... కొంచెం ఆ ఏడుపు మొహం మార్చరా బాబూ... “అన్నాడు, రమేష్, రమణతో. రమణ రెండు చేతులతో మొహాన్ని గట్టిగా తుడుచుకుని, కుర్చీలో సరిగ్గా కూర్చున్నాడు. నళినీ  లోపలకి వస్తూనే వాళ్ళిద్దర్నీ చూసి, “ఓ... ఇవాళ అప్పుడే వచ్చేసారే... “అని అంటూ, అక్కడున్న కప్పుల్ని చూసి, “టీ కూడా తాగేసినట్లున్నారే.. చాలాసేపయిందా.. వచ్చి... “అంది. “అబ్బే ... ఇప్పుడే ఒక అరగంట అయింది వచ్చి... ఎలాగూ నువ్వు కూడా వస్తావుకదాని టీ పెట్టాను... కప్పులో ఉంది చూడు... “అన్నాడు రమేష్. “ఓ... థాంక్యూ.. “అని నవ్వుతూ లోపలికి వెళ్ళింది. పదినిమిషాల్లో మైక్రోవేవ్ లో వేడి చేసుకున్న టీ కప్పుతో వచ్చి కూర్చుని, “చెప్పు, రమణా... ఏమిటి విశేషాలు.. “అంది నవ్వుతూ. “ఆ... ఏముంటాయిలే... ఏవో మా ఆఫీస్ విషయాలే మాట్లాడుకుంటున్నాము... పెద్ద సీరియస్ విషయాలేమీ లేవు.. “అంటూ రమణకి బదులు తను సమాధానమిచ్చాడు, రమేష్. “సరి, ఇంతకీ పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు, రమణా.. ? తొందరగా పెళ్ళిచేసుకుంటే నాకు కూడా ఒక తోడు దొరుకుతుంది. “అంది, నవ్వుతూ నళిని. “ఆ..ఆ.. చేసుకుంటాడ్లే ... తొందరేముంది.. “మళ్ళీ రమేషే సమాధాన మిచ్చాడు. నళిని రమేష్ కేసి సీరియస్ గా ఒక్కసారి చూసి, “నువ్వు చెప్పు, రమణా.. ఏమంటున్నారు మీ ఇంట్లో ... అసలు నీకు సంబంధాలు చూస్తున్నారా, లేదా... లేకపోతే చెప్పు ... నేను చూస్తాను. “అంటూ చిరునవ్వు నవ్వింది, నళిని. “చూడకేం అక్కా... చాలానే చూస్తున్నారు ... నాకే ఇంకా టైం దొరకడం లేదు, మా ఊరు వెళ్ళడానికి. “అన్నాడు, చిన్నగా రమణ, రమేష్ వైపు చూస్తూ. రమణ నళిని ని “అక్కా.. “అని పిలుస్తాడు.”తొందరగా వెళ్ళి సెటిల్ చేసుకురా... సరదాగా నీ పెళ్ళికి వచ్చి, మేమంతా బాగా ఎంజాయ్ చేస్తాం. “అంది నళిని. “బావుంది... నువ్వు ఎంజాయ్ చేయడానికి వాడిప్పుడు పెళ్ళి చేసుకోవాలా ...? “అంటూ నవ్వాడు, రమేష్. నళిని ఏదో అనబోతుంటే రమణ లేచి, “ఒకే... ఇక నేను వస్తాను... “అంటూ ఇద్దరికీ “బై “చెప్పి వెళ్ళిపోయాడు.

నళినికీ, రమేష్ కీ ఐదేళ్ళ క్రితం పెళ్ళైంది. వాళ్ళది ప్రేమ వివాహం... ఇద్దరి తల్లితండ్రులకీ కాదని చెప్పడానికి కారణమే లేదు... ఎందుకంటే ఇద్దరదీ ఒకటే కులం. హోదా లో కానీ, పరపతిలో కానీ, సంపదలో కానీ ఎవరికి ఎవరూ తీసిపోరు. పెళ్ళయ్యాక ఇద్దరికీ బెంగుళూరులో ఉద్యోగాలొచ్చాయి. వెంటనే కంపనీ ద్వారా అమెరికా వెళ్ళే అవకాశమొస్తే, వెళ్ళి, అక్కడ మూడేళ్ళు ఉండి, మళ్ళీ బెంగుళూరు వచ్చేరు. అప్పుడే రమేష్ కి ఆఫీస్ లో కొత్తగా జేరిన రమణ పరిచయమయ్యాడు. రమణ రమేష్ కన్నా నాలుగేళ్ళు చిన్నవాడు. ఆరడుగుల ఎత్తుతో, తెల్లగా అందం గా ఉంటాడు, రమణ. అస్తమానం వాళ్ళింటికి వస్తూ చాలా తొందరగానే వాళ్ళతో బాగా కలిసిపోయాడు. రమణది ఆంధ్రాలో మారుమూల చిన్న పల్లెటూరు. అతని తల్లితండ్రులు అక్కడే ఉంటారు. పెద్దగా ఉన్నవాళ్ళు కాదు కానీ ఉన్న నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కష్టపడుతున్నారు. కొడుకు చక్కగా చదువుకుంటున్నాడని, అప్పు చేసి, మరీ చదివించారు. బెంగుళూరు వచ్చిన దగ్గరనుంచీ రమణ మారిపోయాడు. అతనికి ఇప్పుడు ఆ పల్లెటూరు వెళ్ళాలనే లేదు. లోకం కొత్తగా కనపడుతోంది. రమణ కూడా ఒక ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అప్పుడప్పుడు రమేష్, నళిని అక్కడకి వెళ్ళినపుడు, నళిని తమాషాగా “తొందరగా పెళ్ళిచేసుకో.. ఈ బ్రహ్మచారి కొంప చూడలేకపోతున్నాను “అనేది. ఎన్నోసార్లు, “సాంబార్ చేయడం నేర్పిస్తా ... నేర్చుకో, రమణా.. నువ్వసలే పక్కా వెజిటేరియనివి... “అనేది నళిని సరదాగా. ఏఒక్కటీ నేర్చుకోలేదు.. రమణ.

ఆరోజు రాత్రి నళిని, “రమణ అలా ఉన్నాడేమిటండీ ..? “అని అడిగింది. దానికి రమేష్, “ఆ ... మామూలే.. ప్రేమలో పడ్డాడు... “అంటూ నవ్వాడు. “ఓ... అయితే ఇంక పెళ్ళన్నమాట.. మరి నాకు ఆ మాట చెప్పచ్చుగా... “అంది, నళిని. “చెప్తాడులే.. నెమ్మదిగా.. బహుశా .. ఆ అమ్మాయిని తీసుకొచ్చి చెప్తాడేమో... “అంటూ అటు తిరిగి పడుకున్నాడు. “రమేష్. అన్నట్టుగానే రమణ ఆ అమ్మాయిని ఒక రోజు వాళ్ళింటికి తీసికుని వచ్చాడు. అమ్మాయి బావుంది. పేరు కరుణ. నళిని సంతోషించింది. పెళ్ళెప్పుడంటే.. మాట దాటేసాడు.. రమణ. అదే విషయం మళ్ళీ భర్తనడిగింది, నళిని. “ఓసి పిచ్చిమొద్దూ ... ఇంకా అర్థం కాలేదా...!? ఇప్పుడు వాళ్ళిద్దరూ సహజీవనం చేస్తున్నారు.. “అంటూ అటు తిరిగాడు, రమేష్. నళినికి నోటినుండి మాట రాలేదు. ఏదో కథల్లో చదవడం, అక్కడక్కడా వినడమే...

ఎప్పుడూ రమణా వాళ్ళే రమేష్ వాళ్ళింటికి వచ్చేవారు. అలా రెండేళ్ళు గడిచాయి... నళిని, రమణని పెళ్ళి మాట అడగడం మానేసింది. ఒకరోజు రమేష్ నళినిని కూర్చోబెట్టి, చెప్పడం మొదలెట్టాడు. “నళినీ! వచ్చే వారం రమణ పెళ్ళి.. కరుణతో .. రమణ తల్లితండ్రులు ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు కాబట్టి మనమే  ఈపెళ్ళి చెయ్యాలి. కరుణ వాళ్ళ వాళ్ళు ఒప్పుకున్నారు. వాళ్ళు చర్చ్ లో చేస్తారు. తర్వాత రెజిస్టర్ అవుతుంది. ఆ తర్వాత మన తెలుగు సాంప్రదాయం లో మన ఇంట్లో చేద్దాం... ఏమంటావ్ .. “అన్నాడు. “ఎందుకు రమణా వాళ్ళవాళ్ళు ఒప్పుకోలేదు..? రమణ వాళ్ళ ఊరు ఎప్పుడు వెళ్ళాడు.. ? “అని అడిగింది, నళిని. రమణ వాళ్ళ అమ్మ చాలా మొండి మనిషట... నువ్వు ఆ పిల్లని చేసుకుంటే మమ్మల్ని ఒదిలేయిరా ... అందిటావిడట. “నళిని ఇంక మాట్లాడలేదు. అన్యమనస్కంగానే అన్నీ చేసింది. పెళ్ళికి రమేష్, నళినీ పెత్తనం వహించి ఏ లోటూ రాకుండా చేసారు.

ఒక రోజు పొద్దున్నే కాలింగ్ బెల్ వినపడి తలుపు తీసింది, నళిని. ఎవరో ఒక పెద్దాయనా, పెద్దావిడా నిలబడి ఉన్నారక్కడ.  “రమేష్ గారి ఇల్లు ఇదేనా.. అండీ ..”అంటూ తడుముకుంటూ నెమ్మదిగా తెలుగులో అడిగారు, ఆ పెద్దాయన. “అవునండీ .. ఇదే.. మీరెవరూ..? “అంది నళిని తలుపు పూర్తిగా తీయకుండానే.. “మేము ... రమణ తల్లితండ్రులమమ్మా.. “నెమ్మదిగా సమాధానం చెప్పారాపెద్దాయన. ఇంతలో “నల్లీ.. ఎవరూ..? “అంటూ వచ్చాడు, రమేష్. నళిని, రమేష్ కి వాళ్ళెవరో చెప్పి, తలుపు పూర్తిగా తీసింది. రమేష్ వాళ్ళని చూసి, మొహం చిట్లించాడు. ఇంక తప్పక వాళ్ళని లోపలకి రానిచ్చాడు. “కొంచెం మా అబ్బాయికి మేము వచ్చినట్లుగా తెలియ పరచండి. వాణ్ణి చూడడానికి ఇంత దూరం వచ్చాము.. ఈ పిచ్చిది కొడుకుని ఏదో అడుగుతానంటూ వచ్చింది... వద్దని ఎంత చెప్పినా వినలేదు.. వాణ్ణి చూసి, రాత్రి బండెక్కేసి వెళిపోతాం, బాబూ... “అన్నారు ఆ పెద్దాయన.  మొబైల్ తీసి, రమణ కి కాల్ చేసి చెప్పాడు. “రమణ వస్తున్నాడు,

కూర్చోండి. "అంటూ బాత్ రూం లో దూరాడు. రమేష్ తయారయ్యేసరికి నళిని టిఫిన్, కాఫీ రెడీ చేసి పెట్టింది. ఆ పెద్దవాళ్ళకి కూడా కాస్త కాఫీ ఇచ్చి, భర్తనడిగింది... రమణ ఇంకా రాలేదేమిటని... "ఆఫీస్ కెళ్ళి సెలవు పెట్టి వస్తానన్నాడు.. ఎప్పుడొస్తాడో.. ఏమిటో.. నువ్వు కూడా వెళ్ళాలి కదా ... ఎలా ... పోనీ ఒక పని చేయి... కింద సెల్లార్ లో వాచ్ మెన్ ఇంటి పక్క ఒక సిమెంట్ బెంచ్ ఉంది కదా ... వీళ్ళని అక్కడ కూర్చోబెట్టి, నువ్వు ఆఫీస్ కి వెళ్ళిపో.. ఒకేనా... బై.."అని నిర్లక్ష్యంగా అంటూ వెళ్ళిపోయాడు, రమేష్.

నళిని ఒక్కసారి వాళ్ళిద్దరి కేసీ చూసింది... బిక్కు బిక్కు మంటూ కూర్చున్నారు, ఇద్దరూ... తను ఇచ్చిన కాఫీ కూడా ఎంతో మొహమాటం గా తాగి, ఆ గ్లాసులు ఎక్కడ పెట్టాలా అని చూస్తూ కూర్చున్నారు. రమేష్ వెళ్ళాక, ఆ పెద్దావిడ లేచి, "ఈ... గ్లాసులూ... "అంటూ అర్ధోక్తి గా ఆపేసింది. వెంటనే నళిని, "ఇలా ఇయ్యండీ, పిన్ని గారూ! ... "అంటూ ఆ గ్లాసులు అందుకుని కిచెన్ సింకులో పడేసింది. తర్వాత ఇద్దర్నీ గెస్ట్ రూం లోకి తీసికెళ్ళి, "పిన్నిగారూ! మీరూ, బాబాయి గారూ స్నానాలు చేయండి... నేను కూడా తయారయి వస్తాను... "అంటూ వెళ్ళి పోయింది, అక్కడినుంచి. ఒక గంటలో తను తయారయి, పని అమ్మాయికి చేయాల్సిన పనులు అప్పచెప్పి వచ్చేసరికి, వాళ్ళిద్దరూ స్నానాలు చేసి కూర్చున్నారు. నళిని ఆఫీస్ కి సెలవు పెట్టేసి, వాళ్ళతో కూర్చుంది. ఏమి మాట్లాడాలో, ఎలా మొదలెట్టాలో తెలియక నళిని, తటపటాయిస్తూ, "రమణ పెళ్ళికి మీరు ఒప్పుకోవలసింది ...పెళ్ళి చేసుకుంటానని అనగానే ఆ పిల్లని చేసుకుంటే మమ్మల్ని వదిలేయరా.. అని అనడం ఎందుకు "అంది. పెద్దావిడ టక్కున తల ఎత్తి, నళిని వైపు చూసి... "మేము ఒప్పుకోలేదని మీకెవరు చెప్పారమ్మా... మా కొడుకా...? అని పెద్దాయన్ని చూస్తూ, "విన్నారండీ ... ఈ మాట.. "అంటూ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుందావిడ. "రాజ్యం... ఊరుకో... "అన్నారు, ఆ పెద్దాయన... నీరసంగా... "రమేష్ చెప్పింది నిజమే... ఆయన మీద చూస్తే కొంచెం మొండిగానే ఉందీవిడ... "అనుకుంది, నళిని. "అమ్మా! నీ పేరేమిటో ...నీకు టైమ్ ఉందంటే నేను మా గురించి కొంచెం చెప్తాను. "అన్నారావిడ. "నా పేరు, నళిని. చెప్పండి, పిన్నిగారూ!.. వింటాను. " అంది, నళిని. ఆవిడ చెప్పడం మొదలెట్టింది.... "మాది చిన్న పల్లెటూరమ్మా... మా లోకమంతా మా పిల్లలే... మాకు పెళ్ళైన తర్వాత పుట్టిన నలుగురు అబ్బాయిలూ పురిట్లోనే పోయి, మాకు పుత్ర శోకం మిగిల్చారు. తిరుపతి వేంకటేశ్వరునికి మొక్కుకుంటే ఆ తర్వాత ఐదేళ్ళకి, వీడు పుట్టాడు. వేంకటరమణ అని పేరు పెట్టుకుని వాడు అడిగిన వన్నీ కొని ఇచ్చి, ఎంతో అపురూపంగా పెంచుకున్నాం. పై చదువులకి డబ్బు లేకపోతే అప్పు చేసి మరీ చదివించాము. నేను అన్నీ వాడికి చెప్పేదాన్ని... ఎంత అప్పు చేస్తున్నాం... ఎందుకోసం అప్పు చేస్తున్నాం.. అంటూ చెప్తే... "అమ్మా.. బెంగ పెట్టుకోకు... నాకు ఉద్యోగం రాగానే, ఈ అప్పులన్నీ తీర్చేసి, మీకొక పెద్ద ఇల్లు కట్టిస్తా... చూస్తూ ఉండు... "అంటూ ఉండేవాడు. ఊళ్ళో వాళ్ళందరూ మా అదృష్టాన్ని పొగిడేవాళ్ళే. "కొడుకంటే... వేంకటరమణేరా... ఎంత బాగా చదువుతున్నాడో చూడండి. "అనేవారే... ఇప్పుడు ఆ అప్పే తడిసి మోపుడు అయింది. దానికి కూడా బాధపడ లేదమ్మా... భూమితల్లిని నమ్ముకున్న వాళ్ళం .. ఆ తల్లి మమ్మల్ని తప్పక కరుణిస్తుంది... "అంటూ ఆమె మొదలుపెట్టి, చెప్పడం ముగించేసరికి, టైమ్ ఒంటిగంటైంది. పెద్దాయన మనసులోనే బాధ పడుతుంటే, పెద్దావిడకి కన్నీళ్ళాగట్లేదు. మధ్య మధ్యలో ఆ పెద్దాయన ఆవిడ వెన్ను నిమురుతున్నారు. భోజనాల టైమ్ కాగానే వాళ్ళకి కూడా అన్నం వడ్డించింది, నళిని. నళిని బలవంతం మీద ఏదో కొంచెం ఎంగిలిపడ్డారు ఇద్దరూ. కాసేపు పడుకోమన్నా వినకుండా కొడుకు కోసం చూస్తూ కూర్చున్నారిద్దరూ. రెండు గంటలకి రమేష్ వచ్చి, రమణ వస్తున్నాడని వాళ్ళతో చెప్పాడు. రమేష్ భోజనం చేసి, హాల్లో కూర్చోగానే.. నళిని ఏదో చెప్పాలనుకుని, "రమేష్!... పాపం, పిన్ని బాబాయి గార్లు చాలా బాధ పడుతున్నారు... "అంటూ మొదలెట్టింది. వెంటనే రమేష్, "నళ్లీ! నీకేమీ తెలియదు.. నువ్వూరుకో ... "అని నళిని కి చెప్పి, "ఆ ... ఇప్పుడు చెప్పండి, అంకుల్ ... ఏమిటి మీ బాధ .. నాకు ఒకటి ఇక్కడ అర్థం కావటం లేదు... మీకు ఒక్కగానొక్క కొడుకు... అతని పెళ్ళికి మీరు అతనికి శాపనార్థాలు పెట్టడమేమిటీ...? ఇదేమైనా బావుందా... ఒప్పుకుంటే ఏమవుతుంది... మీరు చాదస్తాలు వదులుకోవాలి.. రెక్కలొచ్చాక కూడా పిల్లల్నిఇంకా మీ ఒళ్ళో కూర్చోమంటే ఎలా..? "అన్నాడు. వెంటనే, నళిని, "రమేష్! ఏమిమాట్లాడుతున్నావు? వాళ్ళేమన్నారో.. నీకు తెలుసా.. "అంది. "నాకు తెలుసక్కా, వాళ్ళేమన్నారో.. "అంటూ లోపలకి వచ్చి రమేష్ పక్కన కూర్చున్నాడు, రమణ. కొడుకుని చూడగానే, వాళ్ళ కళ్ళల్లో కనిపించిన వెలుగుని చూసి, రమణ వైపు తిరిగి, నళిని, "రమణా! వాళ్ళేమన్నరో తర్వాత చెబుదువుగాని ... కానీ ముందు నువ్వు ఏమి చెప్పావో చెప్పు. "అంది. వెంటనే రమణ, "నేనంతా వివరం గా చెప్పాను, అక్కా... కావాలంటే.. అడుగు."అన్నాడు.

"అదే... ఏమి చెప్పావ్ ... నాకూ కాస్త వివరంగా చెప్పు. "అంది.

"నాకున్నవి నాలుగే పాయింట్లు కదా ... అవే చెప్పాను.. "అన్నాడు.

"అదే .. అవేమిటో చెప్పు "అంది, నళిని రమేష్ కేసి చూస్తూ..రమేష్ నిటారుగా అయ్యాడు.

"సరే.. విను... నేను పెళ్ళి చేసుకుంటున్నాను.. ఆ అమ్మాయి పేరు, కరుణ. నా కన్నా ఆరేళ్ళు పెద్ద. తనకి పెళ్ళై ఇద్దరు పిల్లలు, అబ్బాయికి ఐదేళ్ళు, అమ్మాయికి మూడేళ్ళు. మేమిద్దరం మూడేళ్ళనుండి సహజీవనం చేస్తున్నాం. ... ఇంకోటి కూడా చెప్పాను.. ఆ పిల్లలిద్దర్నీ నేను లీగల్ గా దత్తత తీసుకున్నానని. "అంటూ ముగించాడు, రమణ.

"ఓ.... అయితే.. నువ్వు వాళ్ళకి నువ్వేమి చేసావో, ఏమి చేయదలచుకున్నావో చెప్పావు.... అంతే.. వాళ్ళ అనుమతి ఏమైనా అడిగావా? లేదుగా... "అంది నళిని.

రమణ కి నోట మాట రాలేదు... వెంటనే రమేష్, "అయినా.. కొడుకు తన పెళ్ళి గురించి చెప్పినప్పుడు, వాళ్ళు సంతోషపడకుండా శాపనార్థాలు పెట్టడం తప్పు కాదా... "అన్నాడు.

వెంటనే రమణ, "అవును... మా అమ్మ నన్ను చాలా మాటలు అంది. "అన్నాడు తల ఎగరేస్తూ..

"నాకు చెప్పారు.. ఆవిడ ఏమన్నారో ... మూడేళ్ళ పిల్ల వుందంటున్నావు... మళ్ళీ మూడేళ్ళ నుండీ సహజీవనమంటున్నావు.. ఆ భార్యా భర్తలని విడదీయడం నీకు మంచిది కాదు.. అన్నారు.. అంతే కదా... అదే శాపనార్థమా... ఇంకా ఏమన్నారు. . ఇంకా నువ్వు పెళ్ళి చేసుకోలేదని, ఆ అమ్మాయిని వదిలి రాలేవా .. అని తల్లి మనసు కాబట్టి అడిగితే ... నువ్వేమన్నావు... "నేను ఆ అమ్మాయికి ప్రామిస్ చేసానన్నావు. దానికి ఆవిడ .... నాకు చేసిన ప్రామిస్ మాటేమిటి? అని కదా అడిగారు. వాళ్ళు నీ కోసం అప్పు చేసారు... అయినా దానికి బాధ పడటం లేదు. నువ్వు చేసుకున్న పెళ్ళికన్నా కూడా వాళ్ళని ఇంకా బాధిస్తున్నది ఏమిటో తెలుసా ... నీ పద్ధతి "

"నేనేమి చేసానక్కా!? ఇంకా మా అమ్మే ... ఆ అమ్మాయిని చేసుకుంటే మమ్మల్ని ఒదులుకోరా అంది "అన్నాడు, రమణ.

"అసలు చేసింది సరిగ్గా చేస్తే కదా... అసలు నువ్వు మీ ఊరు వెళ్ళి, మీ తల్లితండ్రులతో మాట్లాడావా... ఇక్కడనుండి ఫోన్ లోనే మాట్లాడావు.. అవునా.. తర్వాత ఇంకొకటి ... వాళ్ళు నీ కన్నవాళ్ళు... నువ్వు కొంచెమైనా వాళ్ళని ఒప్పించడానికి ప్రయత్నించావా... మమ్మల్ని ఒదులుకోరా అని మీ అమ్మ అంటే వదిలేసుకున్నావు... అమ్మ మాట మరి.. వినాలిగా..... చాలా బావుంది... అంటే నువ్వు చెప్పగానే మీ అమ్మా నాన్నా ఒప్పేసుకోవాలి.. నువ్వు మటుకు వాళ్ళకి ఏమాత్రం సహాయం చేయవు... ఇదేమి న్యాయం...? నీకు ఈ ఊరుకి రాగానే ఈ అమ్మాయి పరిచయమయ్యింది... అందుకే ఇప్పటి వరకు నువ్వు వాళ్ళకి ఒక్క రూపాయి కూడా పంపించలేదు... ఒకే .. అది వదిలేయ్.. వాళ్ళు ఆ విషయమేమీ పట్టించుకోవట్లేదు. కానీ కన్న కొడుకు పెళ్ళి తమ చేతులమీదుగా చేసుకునే భాగ్యమే వాళ్ళకి కలిగించలేదు, నువ్వు... నువ్వు సరే... రమేష్! నీ సంగతేమిటి? రమణ వచ్చి మా వాళ్ళు ఇష్టపడటం లేదు అనగానే మీరు నడుం కట్టేసి పెళ్ళి చేయడమేమిటి? రమణని వాళ్ళ ఊరు పంపించవద్దా... అంతగా కావాలంటే మనం కూడా వెళ్ళి వాళ్ళని ఒప్పించడానికి ప్రయత్నించేవాళ్ళం. ఇంకా మీకు అర్థం కాలేదా... వాళ్ళు ఏమి కోల్పోయారోనని.. "అంటూ నళిని మాట్లాడుతుండగానే ఆ పెద్దవాళ్ళిద్దరూ లేచి, వాళ్ళ వైపు తిరిగి ఒక దండం పెట్టి బైటకి వెళ్ళిపోయారు.





Sponsors:

NEW YORK LIFE | Balaji Flowers Usa | GODAVARI USA | CANADA | SOUTHERN SPICE | BIRYANI JUNCTION

Srilatha Collections LLP | Website: srilathacollections.com

Media Support :

mana tv HD | TV5 NEWS | TV ASIA TELUGU | TELUGU NRI RADIO | TV9 | GNN | SAKSHI TV | US 1 TELEVISION | SUNRISE TV

తెలుగు కళా సమితి

## Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey**

# TFAS Women's Day Celebrations



**MARCH 20th, 2022**
**12PM - 3PM**

**Hills Highland Clubhouse**
**75 Hansom Rd,**
**Basking Ridge, NJ**

**FOR TFAS WOMEN MEMBERS ONLY**

**Must Register**
**Limited Space**

**Register at www.tfasnj.org**

| | | | | | |
|---|---|---|---|---|---|
| Sreedevi Jagarlamudi | 732-470-7055 | Bindu Yalamanchili | 908-240-3167 | Jyothi Gandi | 732-208-9599 |
| | | Anuradha Para | 201-312-5335 | Anuradha Dasari | 908-907-1502 |
| | | Srinivas Cheruvu | 732-447-6686 | Ravi Annadanam | 917-355-5503 |

# Women's Day 2022 సంబరాలు











# Women's Day 2022 సంబరాలు











INDIAN AMERICAN DIASPORA
ITServe Alliance
LAUNCH OF
Mana Ooru Mana Badi
PORTAL


ఆహ్వానం
వంశీ ఆర్ట్ థియేటర్స్ ఇంటర్నేషనల్ - ఇండియా & శుభోదయం గ్రూప్స్
సంయుక్త ఆధ్వర్యంలో
స్వర్ణ వంశీ - శుభోదయం అంతర్జాతీయ మహిళా పురస్కారాలు 2022
వంశీ స్వర్ణోత్సవాల సందర్భంగా అంతర్జాతీయంగా సాహిత్య, సంగీత, సాంస్కృతిక, సేవా రంగాలలో రాణిస్తున్న
16 దేశాలలో ఉన్న 37 మంది తెలుగు మహిళల కృషి & సేవలను గుర్తిస్తూ
తేది : 26-03-2022, సా॥ 4.30 గం॥లకు (భారత కాలమానం)
పురస్కార గ్రహీతలు
SUBHODAYAM
GROUP
శుభోదయం మీడియా, వంశీ యూట్యూబ్, ఆర్.కె.వీడియోగ్రఫీ ఫేస్‌బుక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం

# నిదురించే తోటలోకి

డా. ఎమ్. సుగుణరావు

నాకు ఆశ్చర్యం కలిగించే విషయం నేను చేసిన ఈ పనిని కొంతమంది సాహసం అనడం! నిజంగా సాహసమా! నా ఆనందంకోసం, ఆత్మసంతృప్తి కోసం చేసింది. ఈ నిర్ణయం తీసుకోవడం వెనుకనా శ్రీమతి శ్రావణి కొండశిఖరంలా నిలబడింది. ఈ నిర్ణయానికి మూలం ఎక్కడపడింది? అమెరికన్ కాలనీలో అంటే అమెరికాలోని కాలనీకాదు. ఆంధ్రదేశంలోని ఒక నగరంలోని వీధి. ఆ వీధిలో ఉండేవి అమెరికా వెళ్ళిపోయిన సంతానం కోసం వేచి చూస్తూ రోజులు గడిపే తల్లితండ్రులు.

నేను ఈ ఊరొచ్చి పదిహేనురోజులయ్యింది. ఆ కాలనీలో క్లినిక్ ప్రారంభించి వారం రోజులయింది. వేరే జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుడిగా పనిచేసి నా శ్రీమతి ఉద్యోగరీత్యా ఆ ఊరు వచ్చేసాను. నేను వచ్చేముందు ఆ కాలనీలో క్లినిక్ నడిపేది డాక్టర్ సాంబమూర్తిగారు. ఆయన అమెరికా వెళ్ళిపోయారు కొడుకుల దగ్గరకు. నన్ను ఆ క్లినిక్ చూడమనడంతో ఒప్పుకున్నాను. అరవయ్యేళ్ళు పైబడిన పేషంట్లతో వింతయిన అనుభవం. చెప్పిందే చెపుతారు. విసుగొస్తుంది. అయినా తప్పదు. వాళ్ళకు ఏ ట్రీట్మెంట్ ఇవ్వక్కరలేదు. వాళ్ళు చెప్పేది వింటే చాలు.

ప్రస్తుతం క్లినిక్ లో ఉన్నాను. సమయం సాయంత్రం ఆరయ్యింది. పేషంట్లతో బిజీగా ఉన్నాను. నా ఎదురుగా ఓ ముసలాయన. ఆయన చెప్పింది విని, ప్రిస్క్రిప్షన్ రాసి బయటకు పంపేసరికి ఫోన్ మోగింది.

"హలో...నేను ఫణికర్, బావున్నావా?!" అన్నాడు

"బావున్నాను. ఎక్కడున్నావ్?" అన్నాను.

"నేను బోర్డర్లో ఉన్నాను. జమ్ములో పోస్టింగ్. ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి." అన్నాడు.

"ఏంటి?" అన్నాను.

"మన సంగీతం మాస్టారు సదాశివంగారు నువ్వు క్లినిక్ పెట్టిన అమెరికన్ కాలనీలోనే ఉంటున్నారు. కొడుకులు, కూతుళ్ళు అంతా ఉండేది అమెరికాలోనే. పాపం ఈ మధ్యే మాస్టారుగారి భార్య చనిపోయిందట. ఇక మరీ ఒంటరితనం. తనను తాను పూర్తిగా మర్చిపోయారట. ఎవరినీ గుర్తు పట్టడంలేదుట. ఒకసారి వెళ్ళి చూసిరా." అన్నాడు.

"నేనూ విన్నాను. ఆయనను చూడ్డానికి వెళతాను. అయినా ఆయనను రోజూ చూస్తూనే ఉన్నాం. టీవీల్లో, పత్రికల్లో, ఆయన దగ్గర సంగీతం నేర్చుకున్న వాళ్ళంతా ఆయనను వేనోళ్ళ పొగుడుతూ ఆయనను గుర్తు చేసుకుంటున్నారు." అన్నాను.

"ఎంత గొప్ప సంగీత విద్వాంసుడైతే మాత్రం ఇపుడు ఆయన జీవితం చేదుగా మారింది." అన్నాడు ఫణికర్ నిర్లిప్తంగా.

"బాధపడకు. రేపే వెళ్ళి మాస్టారిని చూసొస్తాను. ఆ తర్వాత నీకు ఫోన్ చేస్తాను." అన్నాను.

పేషంట్లను చూడడంలో మునిగిపోయిన నాకు అరగంట తర్వాత తీరిక లభించింది. ఫ్లాస్క్ లో కాఫీ వంపుకుని తాగుతూ ఆలోచనలో పడ్డాను.

ఫణికర్ ను మొదటిసారిగా కలిసింది సదాశివంగారి సంగీతం క్లాసులో. అప్పుడు నా వయసు పధ్నాలుగేళ్ళు. తొమ్మిదో తరగతి చదువుతున్నాను. అప్పటికే నాకు భూతద్దాల కళ్ళజోడు. రాత్రిళ్ళు ఎక్కువసేపు చదివితే తలపోటు బాగా వచ్చేది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఎవరో సలహా ఇచ్చారు సంగీతం నేర్చుకోమని. అది ధ్యానంలా సాయపడుతుందన్నారు. అప్పుడే ఫణికర్ తో పరిచయం. తనకు గాయకుడిగా పేరు తెచ్చుకోవాలనే కోరిక ఉంది. అలా సదాశివంగారి క్లాసులో చేరాడు. ఇద్దరం స్నేహితులం అయ్యాము. తొమ్మిదో తరగతినుంచి ఇంటర్ వరకూ సదాశివంగారి సంగీతపు క్లాసులో గడిపినవన్నీ మధురక్షణాలే! ఆ ఇంట్లోకి అడుగుపెట్టగానే అన్నివైపుల నుంచి సంగీతమే వినిపించేది. గడపతాకితే గమకాలు పలికేవి. తలుపులు తాళం వేసేవి. మా సంగీత శిక్షణ సరళీస్వరాలతో మొదలై దాటుస్వరాలు, జంటస్వరాలు, అలంకారాలు, పిళ్ళారిగీతాలు, వర్ణనలు... ఆ తర్వాత కీర్తనలు.

ఇంటర్ తర్వాత మెడిసన్ లో సీటొచ్చి నేను, నేషనల్ డిఫెన్స్ అకాడమీలో సీటొచ్చి ఫణికర్, వేరే రాష్ట్రాలకు వెళ్ళిపోయాం. మా సంగీత సాధన అక్కడా మొదలయింది. నా మైగ్రేన్ తలనొప్పి పూర్తిగా తగ్గిపోయింది. మెడిసన్ చదువు ప్రశాంతంగా సాగడానికి సదాశివంగారు నేర్పిన సంగీతం చాలా ఉపయోగపడింది. ఎమ్. బి. బి. ఎస్. అయిన తర్వాత ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పోస్టింగ్ వచ్చింది. ఆ తర్వాత మేనత్తకూతురితో పెళ్ళి. తను లెక్చరర్. ఇద్దరివి వేర్వేరు ఊళ్ళల్లో ఉద్యోగాలు. పెళ్ళయి ఐదేళ్ళయినా జన్యుసంబంధమైన కారణాలవల్ల మాకు పిల్లలు కలగలేదు. ఇద్దరికీ సంగీతాభిరుచి ఉంది. తను బాగా పాడుతుంది. మాకు పిల్లలు లేని లోటు సంగీతం తీరుస్తోంది.

ఇలా నా జీవితంలో ప్రతీ దశలోనూ సంగీతమే వెన్నుదన్నుగా నిలుస్తోంది. దానికి ఆద్యుడైన సదాశివంగారూ నాలో ఒక భాగం అయిపోయారు.

పిల్లలులేరనీ, ఎంతకాలం ఇలా ఉంటారనీ బంధువులు, ఆత్మీయులు శతపోరడంతో బాబునో, పాపనో దత్తత తీసుకోడానికి నిర్ణయించాము. అయితే ఇద్దరం వేరు వేరు ఊళ్ళల్లో ఉండడంతో వీలుకాలేదు. ఇప్పుడు ఒకచోట కొచ్చాము. కనుక ఆ పని మొదలెట్టాలి అనుకున్నాను.

★★★★

తరువాతిరోజే ఆదివారం. సదాశివంగారి ఇంటికి బయలుదేరాము నేను, నా శ్రీమతి. శివాలయం కోనేటివీధి. రంగువెలసిన డాబాఇల్లు. ఆ చిరునామా మనసు పొరల్లో పదిలంగా ఉంది. ఇప్పుడు ఆ దృశ్యం మారింది. ఆ రంగు వెలసిన డాబాస్థానంలో నాలుగు ఫ్లోర్లున్న గ్రూప్ హౌసింగ్. అటువైపుగా

వెళుతున్న ఒక పెద్దాయనను అడిగాను. "సదాశివంగారి ఇల్లెక్కడా?!" అని. ఆయన నావంక ఆశ్చర్యంగా చూసి "మీరు ఈ ఊరికి కొత్తా?! కొడుకులు పాతిల్లు పడగొట్టించి ఈ ఇల్లు కట్టారు. అంతా అద్దెకిచ్చేసి రెండు గదులుంచారు ఈయనకోసం, తల్లిగారికోసం. ఆవిడపోయి ఆరునెలలయింది. పిల్లలంతా అమెరికాలో, ఈయనొక్కడే ఇక్కడ. ఈమధ్యనే మతిస్థిరం లేకుండా తిరగడంతో ఎవరో పనిపిల్లను పెట్టారు చూసుకోడానికి." అంటూ ఆయన వెళ్ళిపోయాడు.

కారుదిగి లోపలకు నడిచాము. ఇరవయ్యేళ్ళ అమ్మాయి తలుపు తీసింది.

"మీరెవరు?" అంది.

"సదాశివంగారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను." చెప్పాను.

"అయ్యగారికి బాగోలేదు. ఎవరినీ గుర్తు పట్టేదశలో లేరు..."అంది.

"ఒకసారిచూసి వెళిపోతాము" అన్నాను.

"సరే. రండి" అంటూ లోపలకు వెళ్ళింది.

ఆమెను అనుసరించాము. చిన్న గది. లైట్లు పలచగా వెలుగుతున్నాయి. చిందరవందరగా బట్టలు. గుప్పుమంటూ ముక్కు పగిలేలా వాసన. లోపల గదిలో నేలమీద బొమ్మలు ముందేసుకుని ఆడుకుంటున్న ఒకప్పటి సంగీతవిద్వాంసులు సదాశివం. పెరిగిన గెడ్డం, తైలసంస్కా లేని జుట్టు, మాసిన లాల్చీ, పైజమా.

నిత్యం రాగాలాపనలో, స్వరసంగమం లాంటి ఆ ఇంట్లో నిశ్శబ్దం తాండవిస్తోంది.

"నమస్కారం మాస్టారూ!" అన్నాను. ఆయన తలెత్తలేదు. నన్ను గుర్తించే స్థితిలో లేరు.

ఎంతోమందికి శృతిబద్ధమైన సంగీతం నేర్పించిన సదాశివంగారి జీవనరాగం శృతి తప్పింది.

తెల్లటిలాల్చీ, 'పైజమాతో మందహాసం చిందే ముఖారవిందంతో నిత్యం రాగరంజితంగా వుండే ఆయనను ఆ స్థితిలో చూసిన నాకు కన్నీరు ఆగలేదు. ఇద్దరం వేగంగా ఆ ఇంట్లోంచి బయటకు వచ్చేసాము. కారులో కూర్చున్నా ఆయన దీనావస్థ కళ్ళముందు మెదులుతోంది. పిల్లలంతా అమెరికాలో ఉన్నారు. తోడుగా, నీడగా నిలిచే భార్యలేదు. ఆదరించే బంధువులు లేరు. అందుకనేమో ఆయన మతితప్పింది. వృద్ధాప్యంలో శాపగ్రస్తుడిని చేసిన అల్జీమర్స్. అందరినీ మర్చిపోయే మానసికస్థితి. ఇంకా ఖచ్చితమైన కారణం కనిపెట్టలేని వ్యాధి. మెదడు కణాలు కుంచించుకుపోయి పరిమాణం తగ్గిపోవడంవల్ల ఈ వ్యాధి కలుగుతుందని ఒక పరిశోధన. ఇంటికొచ్చినా ఆయన నా మనోఫలకం నుంచి చెరిగిపోలేదు.

★★★★

తరువాతి రోజు పేషంట్లను చూసి, మహిళాశిశుసంక్షేమ కార్యాలయానికి బయలుదేరాను. దత్తత స్వీకరణ గురించిన వివరాలు తెలుసుకుందామని. కారు పార్క్ చేసి లోపల కలిసిన అధికారిని అడిగాను. ఆయనో అప్లికేషన్ ఇచ్చారు.

"దీన్ని పూర్తి చేసి, మేం అడిగిన డాక్యుమెంట్లను జతచేసి, కట్టవలసిన ఫీజుతో ఆన్లైన్లో పేరు నమోదు చేసుకోవాలి. సంవత్సరం తర్వాత అనాథ శరణాలయంలో లాటరీపద్ధతి ద్వారా పిల్లలను దత్తతకోసం స్వీకరించవచ్చును." అన్నాడాయన.

"సంవత్సరమా?!" అంటూ నోరు వెళ్ళబెట్టాను.

"ఏమో ఇంకా ఎక్కువ పట్టవచ్చు." అంటూ ఆయన తను చదువుతున్న ఫైలులోకి తల దూర్చాడు.

ఆయన మాటలు షాక్ కలిగించాయి. "దత్తత వెనుక ఇంత తతంగమా!" అనుకుంటూ ఆ ఆఫీసులోంచి బయటకొచ్చి కారెక్కాను.

మనసులో ఏదో దిగులు. చిరకాలంగా పిల్లలకోసం తపన పడుతున్న శ్రావణికి ఇదిఆశనిపాతం!

మెల్లగా డ్రైవ్ చేస్తున్నాను. ఫోన్ మోగింది. అవతల లైన్లో ఫణికర్.

"బాగాలేదు సదాశివంగారి పరిస్థితి." అంటూ మొత్తం వివరించాను.

"అయ్యో...!" అంటూ నిట్టూర్చాడు. క్షణంవరకూ మౌనం. వెంటనే అన్నాడు.

"మీ దత్తత స్వీకారం ఎంతవరకూ వచ్చింది?"

"చాలా పెద్ద తతంగం. రెండు మూడు సంవత్సరాల సమయం పట్టేటట్టు వుంది." అన్నాను దిగులుగా.

"సరే. ముందు అప్లికేషన్ పెట్టు. నిరాశపడొద్దు." ఫోన్ పెట్టేసాడు.

కారు ముందుకు సాగుతోంది. శ్రావణి గురించి నా ఆలోచనలు. ఆమెకు తల్లి కావాలనే తపన. అది తీరే అవకాశంలేదు. అందుకోసం ఒక పాపనో, బాబునో దత్తత తీసుకోవాలని, ఆ కోరికా తీరేటట్లులేదు. ఆలోచనలు తెగడంలేదు. బుర్రవేడెక్కుతోంది.

ఒక కప్పు కాఫీ తాగితే బావుంటుంది. పక్కనే చిన్నకాఫీ బంకు. కారు పక్కకు తీసి ఆపాను. కాఫీ ఆర్డర్ ఇచ్చి ఆలోచిస్తూ నిలుచున్నాను. ఇంతలో మళ్ళీ ఫణికర్ నుంచి ఫోన్. ఫోన్ ఎత్తాను.

"ఒక విషయం. చాలాముఖ్యమైంది." అన్నాడు.

"సరే చెప్పు!" అన్నాను.

శిశు సంక్షేమశాఖ వారి ప్రమేయం లేకుండా ఒక బాబును దత్తత తీసుకునే అవకాశం ఉంది." అంటూ చెప్పడం మొదలెట్టాడు ఫణికర్.

ఆ మాటలు వినగానే నాలో చిన్న అలజడి, ఆలోచన్లో పడ్డాను.

ఫణికర్ సంభాషణ అయిపోయినా ఇంకా ట్రాన్స్ లోనే ఉన్నట్టనిపించింది. వెంటనే శ్రావణికి ఫోన్ చేసాను. ఫణికర్ చెప్పింది చెప్పాను. ఏ ఆలోచనా లేకుండా వెంటనే చెప్పింది.

"మీఇష్టం. నాకేమీ అభ్యంతరం లేదు."

ఆ మాటలతో కొండంత రిలీఫ్. మనసులో ఏదో సాంత్వన.

★★★★

తరువాతి రోజు -

"బాబును తీసుకువస్తున్నాను. చూసుకోడానికి ఒక ఆయానూ తీసుకువస్తున్నాను. బాబు కోసం రూమ్ రెడీ చెయ్యి." అంటూ ఆస్పత్రినుంచి శ్రావణికి ఫోన్ చేసాను.

"అలాగే..." అంది.

గంట తర్వాత బాబుతోనూ, ఆయాతోనూ ఇంటి దగ్గరకొచ్చాను.

శావణి హారతి పళ్లెంతో ఎదురయ్యింది. ఆ తర్వాత ఆయా సాయంతో తలస్నానం చేయించింది. కొత్తబట్టలు తొడిగింది. అన్నం కలిపి తినిపించింది. అరగంటతర్వాత పనులన్నీ ముగించుకుని నేను చదువుకుంటున్న రూములోకి వచ్చి కూర్చుంది. చాలా అలసిపోయినట్టు కనిపించినా ఆమె ముఖంలో ఏదో సంతోషం.

"నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది. కన్నుల్లో నీరు తుడిచి, కమ్మటికల ఇచ్చింది." అంటూ పాటపాడి

"ఆ తర్వాత!" అంది నావంక చూసి నవ్వుతూ.

నాకు చాలా ఇష్టమైన శేషేంద్రశర్మ గారి గీతం గుర్తు చేసుకుంటూ–

"రమ్యంగా కుటీరాన రంగవల్లులల్లింది

దీనురాలి గూటిలోన దీపంగా వెలిగింది

శూన్యమైన వేణువులో ఒక స్వరం కలిపి పాడింది

ఆకురాలు అడవికి ఒక ఆమని దయచేసింది"

అంతవరకే వచ్చు అన్నాను పాడడం ఆపి –

పాట గుర్తు చేసుకుంటూ ఆలోచనల్లో పడింది శ్రావణి.

"విఫలమైన కోర్కెలు వేలాడే గుమ్మంలో ఆశల

అడుగులు తడబడి అంతలో పోయాయి –

కొమ్మల్లో పక్షుల్లారా, గగనంలో మబ్బుల్లారా

నదితోసుకుపోతున్న నావను ఆపండి

రేవు, బావురుమంటోందని నావకు చెప్పండి" –

నాకు, శ్రావణికీ ఆశ్చర్యం. పాటపాడేది ఇద్దరమూ కాదు. లోపల గదిలోంచి పాట పాడుతున్నది బాబే! అదృష్టం కలిసొస్తే నడిచివచ్చే కొడుకు పుడతాదంటారు. మాకు పాటలు పాడే కొడుకు దొరికాడు. గతం మర్చిపోయినా, స్వరగతులు మర్చిపోని సదాశివంగారు పాడుతున్నారు రాగయుక్తంగా–

ఇద్దరం సంతోషంగా లోపల గదిలోకి పరిగెత్తాము. ఇంతలో బయట జీపు ఆగిన శబ్దం వినిపించింది. "సార్" అంటూ బయట బెల్ కొట్టిన చప్పుడు. గబగబా బయటకొచ్చాను. ఆగిన పోలీసువారి వాహనంలోంచి ముగ్గురు పోలీసులు దిగారు.

నాలో ఆశ్చర్యం... కొద్దిగా ఆందోళన. వారివంకే చూస్తూ ఉండిపోయాను.

"మీరేనా డాక్టర్ జగదీష్?" అన్నాడొక పోలీస్.

"ఔను." అన్నాను.

"డాక్టరై ఉండీ మీకిదేం పని సార్? మీమీద కిడ్నాప్ కేసు పెట్టారు. సదాశివం అనే వ్యక్తిని కిడ్నాప్ చేసారని, సెక్షన్ 360 క్రింద పదేళ్ళు శిక్ష పడుతుంది. కేసు పెట్టింది అమెరికాలో ఉన్న వారిపిల్లలు." అన్నాడు మరో పోలీసాయన నావంక కోపంగా చూసి–

వెంటనే ఆలోచనల్లో పడ్డాను. నాకిపుడు పూర్తిగా అర్థమయింది. నేను సదాశివంగారిని వారి ఇంట్లోంచి తీసుకొచ్చి నా సంరక్షణలో ఉంచుకోవడం ఒక సాహసమే అని చాలామంది ఎందుకన్నారో నాకిపుడు పూర్తిగా అవగతమయింది.

ఫణికర్ కూడా తను సరిహద్దులో శతృసైన్యంలో చేసే యుద్ధంలాంటిదే ఇదీ అన్నాడు. ఎప్పుడు ముగుస్తుందో తెలీదు...! ఔను తప్పదు. యుద్ధం మొదలెట్టిన తర్వాత మధ్యలో ఆపలేం కదా...ఏమైనా ఈ యుద్ధంలో పూర్తిగా పోరాడడానికే నిశ్చయించాను.

"ఇంతకీ మీరు కిడ్నాప్ చేసిన సదాశివం గారెక్కడ?" అన్నాడు అంతవరకూ నోరువిప్పని ఇంకో పోలీసు. లోపలగదివైపు చేయి చూపించి వారితో ముందుకు నడిచాను.

లోపల బెడ్రూములో కనిపించిన దృశ్యం చూసి పోలీసులు ఒక్క క్షణం ఆగిపోయారు. టాయిలెట్ కు వెళ్ళిన సదాశివంగారి డైపర్ తీసి శరీరాన్ని తుడుస్తోంది శ్రావణి. వెంటనే వచ్చిన ఆ ముగ్గురు పోలీసువారు ముక్కులకు జేబు రుమాళ్ళు అడ్డం పెట్టుకుని ఎంత వేగంతో లోపలకు వచ్చారో, అంతే వేగంతో బయటకు నడిచారు. నేనూ వారిని అనుసరించాను. పోలీసులు నావంక పరిశీలనగా చూసారు..రెండు చేతులూ జోడించారు. వారి ముఖాలు చూసిన నాకు ఆశ్చర్యం. చాలా ప్రశాంతంగా ఉన్నారు.

"సార్ మమ్మల్ని క్షమించండి. మీతో కోపంగా మాట్లాడాం. శిక్ష వెయ్యాల్సింది మీకు కాదు, ఫిర్యాదు చేసిన సదాశివంగారి సంతానానికి." అంటూ ముందుకు కదిలారు.

"ఆగండి. నమస్కారం చెయ్యాల్సింది నాకు కాదు, నా శ్రీమతి శ్రావణికి. ఆ అరవయ్యేళ్ళ పసివాడిని తన కన్నబిడ్డలా ఆదరిస్తున్నందుకు ఆ సెల్యూట్ శ్రావణికే." అన్నాను నా కళ్ళల్లోకి ఉబికివస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ –

పోలీసులు ముగ్గురూ ఒక్కసారిగా తమ బూట్లను దగ్గరగా చేర్చి లోపల గదిలో ఉన్న శ్రావణికి సెల్యూట్ చేసారు.

గదిలోంచి "నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది..."

పాట మొదలయ్యింది మళ్ళీ.

# SOMIREDDY
LAW GROUP

## Our Services

Immigration
Litigation
Corporate Law
Criminal / Traffic
Personal Injury
Family Law
Wills, Trusts & Estates



www.somireddylaw.com

**New Jersey Office:**

5 Independence Way,
Suite 200, Princeton,
NJ 08540
Phone: +1 (703) 544-2200
Email: NJlegal@somireddaw.com

**Virginia Office:**

One Loudoun,
20745 Williamsport Pl, Suite 380 & 390,
Ashburn - VA 20147
Phone: +1 (703) 544-2200
Email: info@somireddylaw.com

Offshore Office Locations: Hyderabad, India

# MOVERS.Com



## Local Moving, Long Distance Moving, Auto Shipping or International Moving

### THE MOVERS.COM ADVANTAGE

Since 2001, we have seen the moving industry go through fundamental changes. This helped us perfect a platform for you to easily and securely request multiple quotes from vetted moving service providers. We also provide you with helpful guides and resources to take control of your move every step of the way.

### OUR MOVING SERVICES

Whether you're moving across the block or the globe, you will find the right services for your needs. Our network consists of local, long distance and international movers. We also offer services for any type of move, including auto transportation, small moves, truck rentals, storage, and moving labor.

### THE MOVERS.COM PHILOSOPHY

We help people move every day, so we know what a fair, hard-working, and professional mover is comprised of. Before a moving company joins our network, we check that they have fulfilled any state and federal regulatory compliances.



Vidya Garapati - CEO

**Call us for free Quotes**

**1-866-343-1243**